Prajalakshyam Telugu Daily
ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

**- కోవిడ్ తరహా సంక్షోభం**
**- నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ ?**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 24 : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమవారం లోక్‌సభ లో, ఇవాళ రాజ్యసభలో ఆయన

11 లో

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

**- మోడీ, అమిత్‌షా, జైశంకర్‌లను లేపేస్తామని హెచ్చరిక**
**- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదరింపులు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 24 : దేశంలోని ప్రముఖులను హత మారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు

11 లో

సంపుటి: 16 | సంచిక: 305 | కరీంనగర్ | బుధవారం 25 మార్చి 2026 | పేజీలు: 12 | వెల: 2.00



## అర్హులైన జర్నలిస్టులకు
# అక్రిడిటేషన్ కార్డుల మంజూరు



- రాష్ట్ర మీడియా కమిటీ సమావేశంలో నిర్ణయం
- ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ
- కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు చేసినట్లు రాష్ట్ర మీడియా కమిటి చైర్మన్, రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ రాష్ట్ర మీడియా కమిటి సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్ (రాష్ట్ర సమాచార-పౌర సంబంధాల శాఖ కార్యాలయం)లో మంగళవారం రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ-స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది.ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార-పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రి డిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తు

11 లో

## త్వరలో
# 'సాదాబైనామా' పరిష్కారం



- కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి24 : రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైంనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

11 లో



# మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

**- గతంలోనే హైకమాండ్ హామీ ఇచ్చింది**
**- మరోమారు మంత్రి పదవిపై పెదవి విప్పిన రాజగోపాల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి24: కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. తనకు పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు గతంలో హామీనిచ్చిన అధిష్టానం ఇపుడు ఏం

11 లో

## ఇవి వాహనాలపై
# 20శాతం డిస్కౌంట్




- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహీంద్రా తదితర కంపెనీలు
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరిం చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ

11 లో




## క్షయవ్యాధిపట్ల ప్రజలు
# అప్రమత్తం అవసరం

- వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి
- ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది
- నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి న ఇవారణకు అనేక చర్యలు తీసుకుంటున్నా.. మళ్లీ ఇది విజృంభించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని అన్నారు. అంతర్జాతీయ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మాట్లాడారు. అను మానం ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెంది సమాజానికి సవాల్ చేయగలదన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో యువ పల్మనాల జిస్టులు చేపట్టిన

11 లో

# గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

## అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆర్ఎస్

11 లో

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

**- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది**
**- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా**
**- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు.

11 లో

## అసెంబ్లీ ముట్టడికి
# బిఆర్ఎస్ విద్యార్థుల యత్నం

- అడ్డుకున్న పోలీసులు... పలువురి అరెస్టు
- ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : అసెంబ్లీ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ నాయకులు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తం అయిన పోలీసులు బీఆర్ఎస్వీ కార్యకర్తలను అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, వాహనాల్లో నాంపల్లి, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యారంగంపై సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు ధోరణికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ నాయకులు ఇవాళ అసెంబ్లీని ముట్టడించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యారంగం పై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పుచ్చుకుంటుందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విడతల వారీగా బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీ ముట్టడికి వస్తుండటంతో వారిని అడ్డుకోవడానికి పోలీసులు

11 లో

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మార్చి 24 : తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా... పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ... రాజకీయాల్లో తనది పూలబాట కాదని... ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణు గోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం

11 లో

# జిహెచ్‌ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

- మేడ్చెల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి
- అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి24 :బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబం

11 లో



# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

## - కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మార్చి 24 : యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధం కావాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రణాళికపై జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది యాసంగి సీజన్ లో 2 లక్షల 73 వేల 550 ఎకరాల్లో వరి ధాన్యం సాగైందని తెలిపారు. 6 లక్షల 46వేల 320 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేస్తున్నామని, 3 లక్షల 67 వేల 776 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్, హాకా ద్వారా 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాలు, కో-ఆపరేటివ్, డిఆర్డిఓ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్, తేమయంత్రాలు, బరువుతూచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, డ్రైయర్లు, కాలిపర్స్ వంటి సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ధాన్యం మాత్రమే కోసేలా రైతులకు, హార్వెస్టర్ల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు, రవాణా తదితర ఏర్పాట్లు నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, డిఆర్డిఓ శ్రీధర్, డిసిఓ రామానుజాచార్య, డిఎమ్ఓ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ సరఫరాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## - గృహ వినియోగదారులకు ఇబ్బందులు రావొద్దు - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా - గ్యాస్ గోదాంలో తనిఖీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మార్చి 24 : ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి గ్యాస్ సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. సీతారాంపూర్ లోని నిర్మల భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదాములో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గృహ వినియోగదారుల, వాణిజ్య పరమైన సిలిండర్ల బుకింగ్, స్టాక్ నిల్వలు, రోజు వారీ సరఫరా తదితర వివరాలు ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆస్పత్రులకు సరఫరా అవుతున్న సిలిండర్లు, వాణిజ్యపరమైన, గృహ అవసరాల సిలిండర్ల సరఫరా వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. స్టాక్ నిలువలు, బుకింగ్ సంఖ్య తదితర వివరాలను ఎప్పటికప్పుడు పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి తెలియజేయాలని డీలర్లకు సూచించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు ఉన్నారు.

# ఖజానా అధికారుల కర్కషత్వం

## - ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులను పట్టించుకోరు - సమస్యలను పరిష్కరించరు

## - ఆవేదన చెందుతున్న విశ్రాంత ఉద్యోగులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మార్చి 24 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పదవి విరమణ పొందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఖజానా అధికారులు పట్టింపు లేని తనంగా వ్యవహరిస్తుండడంతో ఎంతోమంది విశ్రాంత ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారు. సుమారు 30 ఏళ్లకు పైగా విధులు నిర్వహించి పదవి విరమణ పొంది వారికి వచ్చే బెనిఫిట్స్ కోసం ఖజానా అధికారుల చుట్టూ వారు ప్రదక్షణలు చేస్తున్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను పట్టించుకోని సమస్యలు పరిష్కరించాలని పలువురు విశ్రాంత ఉద్యోగులు ఖజానా అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో 2020 నుండి ఇప్పటివరకు మృతి చెందిన విశ్రాంత ఉద్యోగుల వివరాలు లేవని, అంత్యక్రియల ఖర్చుల పరిహారం చెల్లించని వారి సమాచారం అందించాలని, డి ఎ పొందిన లేదా పొందని ఒంటరి పెన్షనర్ల వివరాలు సైతం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వద్ద లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవి విరమణ పొందిన గర్రెపల్లి కర్ణ గౌడ్ విశ్రాంత ఉద్యోగికి సంబంధించిన నెలవారీగా పింఛను వసూలు వివరాలు అందుబాటులో లేవని, ఇప్పటివరకు వైద్య ఖర్చుల రియంబర్స్మెంట్ బిల్లుల పూర్తి వివరాలు అందజేయాలని ఖజానా కార్యాలయంలో ఇన్ వర్డ్, అవుట్ వార్డ్ రిజిస్టర్లు అందుబాటులో ఉన్నట్లు తమ సంఘంలోని విశ్రాంత ఉద్యోగులకు తెలియదన్నారు. మహిళ ఉద్యోగి మేరీ జాకబ్ 2023లో మృతి చెందారని , ఆ ఉద్యోగికి సంబంధించిన అంత్యక్రియల ఖర్చులు, పరిహారం, పెన్షన్ ఆమె జీవించి ఉన్నప్పుడు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు ఇప్పటివరకు చెల్లించబడలేదని ఆమె కుమారుడు మహేందర్ యొక్క ఆధారిత ధ్రువీకరణ పత్రాలు ఉమ్మడి ఫోటో అతడిని నామినీ గా చూపే ప్రభుత్వ పత్రం బెల్లంపల్లి మండలం తాసిల్దార్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించబడినప్పటికీ సమస్య పరిష్కరించలేదని, మహేందర్ తో ఎటువంటి సంబంధం లేని జాకబ్ వివరాలను అడగడం సరికాదని అయినప్పటికీ అతని అఫీడవిట్ను సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు చేపట్టలేదన్నారు. ఎంతో మంది ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఖజానా అధికారులు తమ సంఘం



పైన నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగిగా బ్రతికున్నప్పుడు ప్రభుత్వం డిఏలు ఇవ్వదని మృతి చెందిన తర్వాత ఒంటరి పెన్షనర్లకు సంబంధించిన ఖజానాల నుండి డబ్బులు రావడంలేదని ఏళ్లు గడిచిన రావలసిన డబ్బుకు ఖజానా కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరుగాలని వారు మదన పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం ఆధ్వర్యంలో వారు ఈనెల 16న పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సైతం అందించారు.

### ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గరేపల్లి కరుణ గౌడ్



జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాక రాజ్యమేలుతున్నాయని, సిబ్బంది కొరత సాకుతో ఖజానా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ఖజానా అధికారులు స్పందించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# పారదర్శకమైన ఓటరు జాబితా కోసమే ఎస్ఐఆర్

## - రాజకీయ పార్టీలు సహకరించాలి

## - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, మార్చి 24 : ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల సంఘం చేపట్టిందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇందుకు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులతో పాటు రాజకీయ పార్టీలు నియమించుకునే బిఎల్ఎ ల పాత్ర కూడా కీలకమని అన్నారు. 1951 నుండి ఇప్పటివరకు 8 సార్లు ఎస్ఐఆర్ జరిగిందని, చివరగా 2002 నుండి 2004 వరకు నిర్వహించారని తెలిపారు. ప్రత్యేక సవరణ ద్వారా జాబితాలో నిజమైన ఓటరు కచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన, రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఎవరూ అపోహకు గురి కావద్దని సూచించారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను తప్పక నియమించుకోవాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత ఓటు హక్కు రానివారు ఉంటే అక్షేపణ చేయవచ్చని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.రమణారెడ్డి (బిజెపి), అబ్దుల్లా అసీం, సయ్యద్ బర్కత్ అలీ, సయ్యద్ (ఏఐఎంఐఎం), సాతినేని శ్రీనివాస్ (బిఆర్ఎస్), ఈ.రవీందర్ (టిడిపి), నాంపల్లి శ్రీనివాస్ (బిజెపి) ఎం.వాసుదేవరెడ్డి (సిపిఐ ఎం), రామిడి తిరుపతిరెడ్డి వి.నర్సింగం(ఐఎన్సి) పాల్గొన్నారు.

# విద్యారంగానికి 20శాతం బడ్జెట్ కేటాయించాలి: టిపిటిఎఫ్ డిమాండ్

## - పిఆర్సీ, పెండింగ్ డీఏల విడుదల-సిపిఎస్ రద్దుకు పిలుపు - భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మార్చి 24 : రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ (ఐడిఓసి) ఎదుట ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి జోగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అధికార పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా, రాష్ట్ర విద్యా కమిషన్ సూచనల మేరకు విద్యారంగానికి 20శాతం బడ్జెట్ కేటాయించాలని కోరారు. అదే విధంగా పిఆర్సీ ఫిట్మెంట్ను వెంటనే ప్రకటించి, దానికి అవసరమైన నిధులను బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏలు తక్షణమే విడుదల చేయాలని, రిటైర్డ్ టీచర్ల పెన్షన్ ప్రయోజనాలను ఒకేసారి చెల్లించాలని కోరారు. సిపిఎస్ విధానం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భారంగా మారిందని పేర్కొంటూ, దానిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని తెలిపారు. విద్యారంగంలో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వడంతో పాటు వారి సేవలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృధ్వి, జిల్లా నాయకులు శివప్రశాంత్, వీరభద్రం సంఘీభావం తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన అధికారికి మెమోరాండం సమర్పించారు. ఈ నిరసనలో టిపిటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్న చూపా...?

## జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల , మార్చి 24 : రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వనికి చిన్న చూపా.. అని జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం హైదర్ పెల్లి గ్రామంలో మొక్కజొన్న పంట కుప్పలను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు ఇప్పటి వరకే దాదాపుగా సగం వరకు దళారులకు అమ్ముకొని క్వింటాలుకు 800 రూపాయలు నష్టపోయారని అన్నారు. ఈ ప్రభుత్వం సరైన సమయానికి ఎరువులు పంపిణీ చేయడంలో విఫలం అయిందని, నకిలీ విత్తనాలు అరికట్టలేక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో విత్తనాల ధర కూడా విపరీతంగా పెంచారని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులని తీవ్రంగా మోసం చేసిందని అన్నారు. వర్షాలకు నష్టపోయిన పంట నష్టపరిహారం కూడా చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం వరి పంటతో పాటు మొక్కజొన్న కూడా క్వింటాలకు 500 చొప్పున బోనస్ తో పాటు మద్దతు ధర 2400 రూపాయలు ఇవ్వాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్ రావు, మాజీ సర్పంచ్ లు అంజయ్య, బుర్ర ప్రవీణ్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు సోమిశెట్టి రాజేష్, పొడేటి అంజయ్య, లైశెట్టి శంకర్, బాధే భీమయ్య, ఓడ్నాల రాములు, ఇమ్మడి ఆదిరెడ్డి లైశెట్టి నర్సయ్య, బదినపెల్లి శ్రీనివాస్, గంగాధర్, దుబ్బరాజం, బోనగని శేఖర్, లైశెట్టి గంగారెడ్డి, ఆకుల దుబ్బరాజం, భూమయ్య, పొడేటి గంగన్న, నర్సవ్వ, నలువల అశోక్, లైశెట్టి చిన్న గంగారాం, పుప్పాల రాజం, లైశెట్టి శశి, దాసరి చిన్న గంగారాం, ప్రశాంత్, మధుకర్, చందు, రవి, మహేష్, కిషన్, శేఖర్, రాకేష్, నరేష్, హరీష్ సాగర్ ప్రవీణ్, రైతులు ఆకుల లక్ష్మి, లైశెట్టి వెంకటేష్, చిత్తారీ అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్య-వైద్య-వ్యవసాయ రంగాలకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు

## - హర్షం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మార్చి 24 : జిల్లాలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు కేటాయించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మహా ముత్తారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదులు, ఆధునికీకరించిన మరుగుదొడ్లు, ఎంఆర్సి భవనం చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటపరికరాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల అభివృద్ధికి ఈ నిధులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అవగాహన కల్పించేందుకు హెచ్ డి ఎఫ్ సి ఎక్స్‌పోజర్ విజిట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలను హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు ద్వారా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో సిఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, హెచ్‌డిఎఫ్‌సి జోనల్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. కుమారస్వామి, తహశీల్దార్ శ్రీనివాస రావు, ఎంపిడిఓ.ప్రకాష్, ఎంఈఓ రవీందర్ రెడ్డి, హెచ్‌డిఎఫ్‌సి ఏరియా మేనేజర్ సంపత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మార్చ్ 24 : భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భూభారతి పోర్టల్లో వచ్చే దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం పాలకుర్తి తహసిల్ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించిన అనంతరం తాసిల్దార్ సునీత సంబంధిత అధికారులకు సూచించారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాత సామాగ్రిని పూర్తిస్థాయిలో విక్రయించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అనంతరం కన్నాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రాథమిక విద్యా ప్రమాణాలు అదేవిధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పాలకుర్తి మండలంలోని నక్కిరెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రాన్ని అకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ పెట్టాలని నిబంధనల మేరకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వెంట పాలకుర్తి తాసిల్దార్ సునీత అధికారులు ఉన్నారు

# విద్యుత్ బస్సులను ఆర్టీసీ యే కొనుగోలు చేయాలి

## - సిఐటియు భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి డిమాండ్.

## - సిఐటియు కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24:సిఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఆర్టిసి డిపో ముందు ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ నాయకులు బస్టాండ్ ఎదురుగా ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు.ఎలక్ట్రిసిటీ బస్సులను ఆర్టీసీ లోనే ఉంచాలని, ప్రైవేటీకరణను ఆపాలని ,ప్రజలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ, సింగరేణి సంస్థలు రాష్ట్రానికి గుండెకాయ లాంటివి అని ఇలాంటి ఇలాంటి సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దుర్మార్గమైన చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని మహాలక్ష్మి పథకం ద్వారా కార్మికులపై పడిన పని భారం తగ్గించాలని, ప్రభుత్వాన్ని



డిమాండ్ చేశారు. కాలుష్య నివారణ పేరుతో విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం వలన డిపోలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. తక్షణం విద్యుత్ బస్సులు ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే విధానాన్ని మానుకొని ఆర్టీసీకి ప్రభుత్వమే బస్సులు కొనుగోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకు పని భారం పెరుగుతుందన్నారు. ప్రయాణికులను అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన వారి స్థానంలో కొత్త రిక్రూట్మెంట్ జరగడంలేదని అన్నారు. కార్మికులకు రావలసిన 2017 సంవత్సరపు బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులను ప్రైవేట్ సంస్థకు ఇచ్చే విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసీఐటీయూ పట్టణ కన్వీనర్ భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, రైతు సంఘం నేత వంకుడోత్ కోబల్, సీఐటీయూ నాయకులు ఎన్ ఎస్ రాజు, నాగేశ్వరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## సీట్లు పెరిగితే...
# రాజకీయ పార్టీలకు పండగే

రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలిమిటేషన్‌కు రంగం సిద్ధం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయో జనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరిగితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కు పోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపి లు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నులనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు.. వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి ప్ఆరతినిధ్యం పెరగడం ఒక్కటే ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించ డంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలు న్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది. 816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37-38కి, అసెంబ్లీ సీట్లు 262-263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీ య నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూ స్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ వాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యా ప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యా ప్తంగా లోక్‌సభ స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్ట్రాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన పక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యా సాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపా దనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

# విరమణ కాదు... విప్లవ నిర్ణయం?
# జీవన్ రెడ్డి మరో రాజకీయ ప్రయాణం

## పార్టీపై అసంతృప్తి పర్వం... మార్పు లేని జీవన్ రెడ్డి నిర్ణయం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



తెలంగాణ రాజకీయాలలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ కురువృద్ధుడు తాడిపర్తి జీవన్ రెడ్డి చుట్టూ నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, రాష్ట్ర రాజకీయ దిశను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధాన్ని కొనసాగించిన జీవన్ రెడ్డి పార్టీని వీడే దిశగా ముందడుగు వేయడం, ఆ నిర్ణయంపై అధిష్ఠానం చేసిన చర్చ లు, సమన్వయ యత్నాలు, వాటి ఫలితం లేకపోవడం... ఇవి ఒక పెద్ద రాజకీయ మార్పు సంకేతాలుగా విశ్లేషించ బడుతున్నాయి.

జగిత్యాలలో జరిగిన తాజా పరిణామం ఈ సంక్షోభాన్ని మరింత గంభీరతరం చేసింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి, పార్టీ వీడవద్దని చేసిన విజ్ఞప్తులు సఫలీకృతం కాలేదు. మంగళ వారం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, పార్టీ విప్ అది శ్రీనివాస్ తదితర కీలక నేతలు స్వయంగా జగిత్యాలకు చేరుకుని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సమావేశం కావడం ఈ వ్యవహారానికి ఉన్న ప్రాధాన్యాన్ని స్పష్టంగా తెలియ జేస్తుంది. సాధారణంగా స్థానిక స్థాయి అసంతృప్తులను జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలోనే పరిష్కరించే కాంగ్రెస్ పార్టీ, ఈ సందర్భంలో నేరుగా జాతీయ స్థాయి ప్రతినిధులను పంపడం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది.

అయితే ఈ సమావేశం ద్వారా ఆశించిన ఫలితం సాధ్యం కాలేదని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జీవన్ రెడ్డి తన నిర్ణయం విషయంలో ఎలాంటి మార్పు లేదని ఖరాఖండిగా తెలియ జేయడం, కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రయాణాన్ని ముగించేందుకు సిద్ధమని చెప్పడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఇది కేవలం వ్యక్తిగత అసంతృప్తి కాకుండా, ఒక విస్తృత రాజకీయ భావజాల మార్పు సంకేతమా అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతోంది.

జీవన్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఆయన కాంగ్రెస్ పార్టీకి ఒక నిబద్ధతగల నాయకుడిగా గుర్తింపు పొందారు. 1970 దశకంలో సర్పంచిగా, మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడుగా, ఆయన రాజకీయ జీవితం, పలు దశాబ్దాల పాటు కొనసాగింది. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్టీ పదవుల్లో పనిచేసి కరీంనగర్ ప్రాంతంలో ఒక బలమైన సామాజిక-రాజకీయ వలయాన్ని నిర్మిం చుకున్నారు. 1980లలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రాంతంలో బలమైన స్థితిలో ఉన్నప్పుడు ఆయన కీలక పాత్ర పోషించారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన ప్రభావం గణనీయంగా పెరిగింది. అధిష్టానం ఆదేశాల మేరకు రెండుసార్లు కరీంనగర్ లోకసభ స్థానం నుండి తెరాస అధినేత కేసీఆర్ పై పోటీ చేయడం గమనార్హం. అయితే 2014 తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో వచ్చిన రాజకీయ మార్పులు, ప్రాంతీయ పార్టీల పెరు గుదల, ముఖ్యంగా బీఆర్‌ఎస్ బలోపేతం, కాంగ్రెస్ బలహీనత... ఇవి ఆయన వంటి సీనియర్ నాయకులపై కూడా ప్రభావం చూపాయి. గణాంకాల పరంగా చూస్తే, 2004లో తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి దాదాపు 50 శాతం ఓటు వాటా ఉండగా, 2018 నాటికి అది 28-30 శాతానికి పడిపోయింది. నాలుగు జిల్లాల పట్టభద్రుల ప్రతినిధిగా ఎమ్మెల్సీగా గెలిచి, శాసన మండలిలో తన గొంతు ద్వారా సత్తా చాటారు. 2023 ఎన్నికలలో కాంగ్రెస్ తిరిగి కొంత పుంజుకున్నప్పటికీ, జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా, నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓటములు రుచి చూడాల్సి వచ్చింది. తర్వాత బి ఆర్ ఎస్ నుండి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ ఆదరించడం, ఆయనకు పార్టీ వ్యవరాల్లోనూ ప్రాధాన్యత ఇవ్వడం, స్థానిక నాయకత్వ విభేదాలు, ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులపై అసంతృప్తులు, వర్గపోరాటాలు ఇంకా కొనసాగుతున్నాయి. జీవన్ రెడ్డి అసంతృప్తి కూడా ఈ విస్తృత సమస్యలలో భాగమే అని విశ్లేషకులు భావిస్తున్నారు.

జీవన్ రెడ్డి పార్టీని వీడే నిర్ణయానికి కారణాలపై అధికారికంగా పూర్తి స్పష్టత రానున్న క్రమంలో, అంతర్గతంగా కొన్ని అంశాలు చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక రాజకీయాల్లో తనకు సరైన ప్రాధాన్యం లభించకపోవడం, నిర్ణయాలలో తన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం, వలస నాయకత్వానికి ప్రాధాన్యం పెరగడం వంటి అంశాలు ఆయన అసంతృప్తికి కారణమయ్యాయని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో మార్చి 25న జగిత్యాలలో జీవన్ రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభ కీలక మలుపుగా మారనుంది. ఈ సభలో ఆయన తన అనుచరులు, అభిమానులు, సహచరులు, సానుభూతి పరులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకుని, తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ సభకు భారీగా జనసమ్మర్థం ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల నుంచి ఆయన అనుచరులు సభకు హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ సభలో ప్రధాన అంశాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. మొదటిది... ఆయన కాంగ్రెస్ పార్టీని అధికారికంగా వీడడం అన్నది. రెండవది... తరువాతి రాజకీయ గమ్యం ఏ పార్టీలో చేరతారో స్పష్టం కానున్నది. మూడవది... ఆయనతో పాటు ఎంత మంది స్థానిక నాయకులు, కార్యకర్తలు కొత్త మార్గాన్ని అనుసరిస్తారు అన్నది. ఈ మూడు అంశాలు తెలంగాణ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశముంది.

విశ్లేషకుల అంచనాల ప్రకారం, జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడితే, కనీసం 10-15 శాతం స్థానిక ఓటు బ్యాంక్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు ఉన్న వ్యక్తిగత అనుబంధం, సామాజిక బలం, వర్గ ఆధారిత మద్దతు... ఇవి ఆయన నిర్ణయానికి రాజకీయ బలం చేకూరుస్తాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఇది ఒక పెద్ద దెబ్బగా మారవచ్చు. ఇంకా ఒక ముఖ్యమైన అంశం... ఈ పరిణామం ఇతర అసంతృప్త నాయకులపై చూపే ప్రభావం. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్‌లో కొందరు నేతలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జీవన్ రెడ్డి నిర్ణయం వారికి ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది. ఇది పార్టీ లోపలి ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని పరిష్కార మార్గాలను అన్వేషిస్తోంది. మహేష్ కుమార్ గౌడ్, సచిన్ సావంత్ వంటి నేతల జోక్యం కూడా అదే దిశగా జరిగింది. అయినప్పటికీ జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడం, పార్టీకి ఒక హెచ్చరికగా భావించవచ్చు. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాకుండా, సంస్థాగత బలహీనతల ప్రతిబింబం అని చెప్పవచ్చు. రాజకీయ విశ్లేషణ కోణంలో చూస్తే, ఈ పరిణామం తెలంగాణలో వచ్చే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. స్థానిక స్థాయిలో నాయకుల మార్పులు, పార్టీ మార్పులు, వర్గ సమీకరణాలు... ఇవి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలు. జీవన్ రెడ్డి నిర్ణయం కూడా అలాంటి ఒక కీలక కారకంగా మారవచ్చు.

మొత్తానికి, జగిత్యాలలో జరుగుతున్న ఈ రాజకీయ నాటకం ఒక సాధారణ నాయకుడి పార్టీ మార్పు కాదని, తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద మార్పుకు సంకేతమని చెప్పవచ్చు. మార్చి 25న జరిగే సభ ఈ కథలో తదుపరి అధ్యాయాన్ని రాయనుంది. ఆ సభలో వెలువడే నిర్ణయం కేవలం జీవన్ రెడ్డి భవిష్యత్తును మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తును, అలాగే తెలంగాణ రాజకీయ దిశను కూడా ప్రభావితం చేసే అవకాశముంది.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**

# రిటైర్మెంట్ హక్కులకు హైకోర్టు రక్షణ కవచం...
# హైకోర్టు జోక్యం కీలకం



## ఏప్రిల్ 9 డెడ్‌లైన్ : రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులపై హైకోర్టు కఠిన ఆదేశాలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో నెలకొన్న జాప్యం, నిర్లక్ష్యం, పరిపాలనా లోపాలపై రాష్ట్ర హైకోర్టు గట్టిగా స్పందించడం ఇటీవలి కాలంలో పరిపాలనా వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీసింది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించిన తర్వాత, వారికి రావాల్సిన గ్రాట్యుటీ, పింఛన్, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి బకాయిలు నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు పెండింగ్‌లో ఉండడం ఒక తీవ్రమైన సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 9లోగా అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం ప్రాధాన్యంగా మారింది.

ఈ కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే, రాష్ట్రంలోని పలు శాఖలకు చెందిన పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో కోర్టును ఆశ్రయించడం ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు ఈ సమస్యను తీవ్రంగా ప్రస్తావించారు. కొందరికి 6 నెలలు, మరికొందరికి 1--2 సంవత్సరాలపాటు కూడా బకాయిలు అందకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాదించారు. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు, ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టు తన పరిశీలనలో ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావించింది---పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు, దయాధర్మం కాదు. పదవీ విరమణ పొందిన వెంటనే బకాయిలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గత తీర్పులను కూడా ఉటంకిస్తూ, పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం రాజ్యాంగంలోని హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న ఉద్యోగులు తమ జీవితావసరాలకు ఈ నిధులపై ఆధారపడతారని, ఆలస్యం చేయడం వారి గౌరవాన్ని దెబ్బతీస్తుందని కోర్టు అభిప్రాయ పడింది. గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్రంలో ప్రతి ఏడాది సుమారు 60 వేల నుండి 80 వేల వరకు ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. వీరిలో కనీసం 30--40 శాతం మంది రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులో ఆలస్యం ఎదుర్కొంటున్నట్లు అంచనా. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం, ఖజానా లోటు, ప్రాధాన్యతల మార్పు వంటి కారణాలతో ఈ చెల్లింపులు వాయిదా పడుతున్నాయి. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం విలువ వేల కోట్ల రూపాయలకు చేరుకుంటోంది. ఇందులో గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డిఎ బకాయిలు ముఖ్యమైనవి.

హైకోర్టు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, "ఉద్యోగి సేవలు తీసుకున్న తర్వాత, అతనికి రావాల్సిన న్యాయబద్ధమైన హక్కులను ఎందుకు నిలిపివేస్తున్నారు?" అని నిలదీసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపించినప్పటికీ, కోర్టు దానిని సరైన సమాధానంగా అంగీకరించలేదు. ప్రజల సేవల కోసం పని చేసిన ఉద్యోగులకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా ఉండాలని పేర్కొంది. అంతేకాకుండా, ఈ చెల్లింపులను ఏప్రిల్ 9లోగా పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించడం ద్వారా పరిపాలనా యంత్రాంగంపై ఒత్తిడి పెంచింది.

ఈ ఆదేశాల ప్రభావం పరిపాలనా వ్యవస్థపై గణనీయంగా పడే అవకాశం ఉంది. మొదటిగా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాల్సిన అవసరం ఉంటుంది. రెండవది, భవిష్యత్తులో ఇలాంటి జాప్యాలు జరగకుండా ఆర్థిక ప్రణాళికను మెరుగుపరచాల్సి ఉంటుంది. మూడవది, డిజిటల్ పద్ధతుల్లో పింఛన్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడం, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించడం అవసరం అవుతుంది. ఇక ఉద్యోగుల కోణంలో చూస్తే, ఈ తీర్పు వారికి ఒక నైతిక బలం ఇచ్చింది. కోర్టు జోక్యం వల్ల తమ సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. ఉద్యోగ సంఘాలు కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు ఇప్పటికే పెండింగ్ బకాయిలపై వడ్డీ చెల్లించాలని కూడా కోరుతున్నాయి. అయితే, ప్రభుత్వానికి ఇది ఒక ఆర్థిక సవాలు కూడా. పెద్ద మొత్తంలో నిధులు తక్షణం సమీకరించడం, ఇతర అభివృద్ధి పనులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయినప్పటికీ, హైకోర్టు ఆదేశాలు చట్టబద్ధంగా అమలు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్ పునర్వ్యవస్థీకరణ, అప్పుల సమీకరణ, ఖర్చుల నియంత్రణ వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

ఇది కేవలం ఒక చట్టపరమైన అంశం మాత్రమే కాదు, పరిపాలనా నైతికతకు సంబంధించిన విషయం కూడా. ఉద్యోగుల సేవలను గౌరవించడం, వారికి సమయానికి హక్కులను అందించడం మంచి పాలనకు సూచిక. ఈ సంఘటన ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

మొత్తం మీద, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. ఇది ఉద్యోగుల హక్కులను రక్షించడమే కాకుండా, పరిపాలనా వ్యవస్థలో బాధ్యతను పెంపొందించే దిశగా ఒక కీలకమైన అడుగు. ప్రభుత్వం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణతో పాటు పారదర్శక విధానాలను అమలు చేస్తే, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తగ్గే అవకాశం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నిరాహారదీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24 : సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కొత్తగూడెం ఏరియా జీ ఏం ఆఫీస్ ఎదుట నిరహార దీక్ష చేపట్టారు. బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ పార్టీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఏస్కె.సాబీర్ పాషా కార్యకర్తలకు పూల దండలు వేసి దీక్ష శిబిరాన్ని ప్రారంభించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్మిక హక్కులు కాపాడు కోవటం కోసం కార్మికవర్గ పోరాటాలు తప్పనిసరి అని భారత కమ్యునిస్టు పార్టీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అనేక పోరాటాలు చేసి ఎన్ని హక్కులు సాధించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో సింగరేణి కార్మికుల సొంత ఇంటి పథకం ,మెడికల్ బోర్డు నిర్వహణ, మారుపేర్ల సమస్య,ప్రైవేటీకరణ తదితర అంశాలపై నిరంతరం ప్రశ్నిస్తూ హక్కులను కాపాడటం కోసం పోరాడుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వీకేఓసీ నందు సింగరేణి యంత్రాలతో, సింగరేణి కార్మికులతో మాత్రమే బొగ్గును తీయాలనీ వీకే సిహెచ్పి క్రషర్ను సింగరేణి కార్మికులతో మాత్రమే నడిపించాలని, కొత్తగూడెం పీవీకే 5 ఇంక్లైన్ నుండి వెళ్ళి సత్తుపల్లి లో దీర్ఘకాలంగా డిప్యూటేషన్ పై పని చేస్తున్న జనరల్ అసిస్టెంట్లను, సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ చేసి కొత్తగూడెం ఏరియాలో పోస్టింగ్ ఇవ్వాలని, జికెఓసీ నుండి సత్తుపల్లి వెళ్ళిన సింగరేణి ఉద్యోగులందరిని తిరిగి వీకేసీఎం కు తీసుకు రావాలనీ,కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలనీ కోరుతూ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్ లు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నిరహార దీక్ష చేస్తున్న కార్మికులను ఆయన అభినందించారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కారం చేయకుంటే కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన యాజమాన్యాన్ని హెచ్చరించారు. నిరహార దీక్ష అనంతరం కార్మికులు బారి సంఖ్యలో జిఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన మెమొరాండాన్ని కొత్తగూడెం ఏరియా జి ఎం షాలెం రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, సహాయ కార్యదర్శి గట్టయ్య ,రాము, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు ,గుమ్మడి వీరయ్య, హీరాలలాల్, బండారి మల్లయ్య, రాజేశ్వరరావు, కర్రు రమేష్, పిట్ కార్యదర్శిలు భూక్యా రమేష్, మధుకృష్ణ, కమల్, ఏంఆర్కే ప్రసాద్, నాయకులు అప్పారావు, మెంగెన్ రవి, కోటి, కుమారరావు, అది రాజేందర్, తిరుపతి, రామచందర్, బండి వెంకటరమణ, గంగారం, గావిని నాగరాజు, వినయ్, అవినాష్, శేషు, సిపిఐ పార్టీ నాయకులు కంచర్ల జములయ్య, భూక్యా శ్రీనివాస్, ఎస్ కే ఫయ్యుం, భూపేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్‌పై దాడులను ఖండించాలి: సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పిలుపు

## - అంతర్జాతీయ శాంతికి ముప్పు - యుద్ధాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24 : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్నట్లు ఆరోపణలున్న దాడులను దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు బాలచంద్ర సడంగి పిలుపునిచ్చారు.మంగళవారం కొత్తగూడెంలోని రైటర్ బస్తి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌర ప్రాంతాలపై దాడులు జరగడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు అమాయక ప్రజల ప్రాణనష్టం కలిగించడమే కాకుండా, అంతర్జాతీయ శాంతి భద్రతలకు ముప్పు కలిగిస్తాయని అన్నారు.ఇరాన్‌కు సంబంధించిన అంశంపై ఒమన్ దేశం మధ్యవర్తిత్వంలో చర్చలు కొనసాగుతున్న సమయంలోనే దాడులు జరగడం అనర్థకమని ఆయన విమర్శించారు. ఈ దాడుల వెనుక రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. భారత ప్రభుత్వం ఈ పరిస్థితిపై స్పందించి యుద్ధాన్ని తక్షణమే ఆపాలని కోరుతూ తీర్మానం చేసి, ఐక్యరాజ్య సమితికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్జాతీయ న్యాయం, శాంతి పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి దాడులను ప్రపంచ దేశాలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గౌని ఐలయ్య, జి. ఝాన్సీ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి. కోటేశ్వరరావు, జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎస్కే ఉమర్, జే. సీతారామయ్య, ఎన్. సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి పోరు యాత్రపై విమర్శలకు మోటపలుకుల రమేష్ ఘాటు స్పందన

## కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మార్చి 24:ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, తమ సంఘం నిర్వహిస్తున్న 'సింగరేణి పరిరక్షణ పోరు యాత్ర'పై విమర్శలు చేస్తున్న ఇతర కార్మిక సంఘాలపై ఘాటుగా స్పందించారు. మంగళవారం రాత్రి సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన తన ప్రసంగంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ నాయకత్వంలో చేపట్టిన పోరు యాత్ర మార్చి 25న సాయంత్రం భూపాలపల్లికి చేరుకుంటుందని, అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా ప్రదర్శన, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కార్మికులను సమస్యలపై చైతన్యపరచేందుకు అన్ని గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తామని వెల్లడించారు. సంస్థలో గతంలో జరిగిన యాజమాన్య పొరపాట్ల వల్ల వేలాది కోట్ల రూపాయలు బకాయిలుగా నిలిచిపోయాయని, సుమారు ?52 వేల కోట్ల మేరకు వివిధ సంస్థలు,ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సంస్థను నిలబెట్టేందుకు పోరాటం తప్పనిసరి అయిందని స్పష్టం చేశారు. కార్మిక సంఘాల ప్రధాన బాధ్యత కార్మికుల సమస్యల పరిష్కారమేనని, ఏ సంఘమైనా కార్మిక వర్గానికి ద్రోహం చేయదని అన్నారు. అయితే రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న కొన్ని సంఘాలు ప్రభుత్వ భయంతో పోరాటాలకు దూరంగా ఉంటున్నాయని విమర్శించారు. సింగరేణి చరిత్రలో గత 80 ఏళ్లుగా సమ్మెలు, పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధించుకున్నామని గుర్తుచేసిన రమేష్, అవసరమైతే అన్ని సంఘాలు కలసి ఐక్యంగా పోరాడే పరిస్థితులు గతంలో ఎన్నో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం కూడా అలాంటి ఐక్యత అత్యవసరమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ మనుగడకు కొత్త గనుల కేటాయింపు, కార్మిక సంక్షేమ చర్యలు, డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ పునరుద్ధరణ వంటి అంశాలు కీలకమని, వీటి పరిష్కారానికి ఈ పోరు యాత్ర అవసరమైందని అన్నారు. కార్మిక సంఘాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, సంస్థ రక్షణ కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మార్చి 25న భూపాలపల్లిలో బాంబులగడ్డ వద్ద యాత్రకు ఘన స్వాగతం పలికి, అంబేద్కర్ చౌరస్తాలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే మార్చి 30న కొత్తగూడెంలో 'చలో కొత్తగూడెం' కార్యక్రమం ద్వారా సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించి ప్రభుత్వం, యాజమాన్యానికి హెచ్చరిక జారీ చేస్తామని తెలిపారు. సంస్థ భవిష్యత్తు కోసం ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే రాబోయే ఐదేళ్లలో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించిన రమేష్, కార్మికులందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులుగా చిన్నసాయి శ్రీరాం ఏకగ్రీవ ఎన్నిక..



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మార్చి 24 : సంగారెడ్డి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కంది సర్పంచ్ చిన్న సాయి శ్రీరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సర్పంచ్ ల చైతన్య సదస్సు సమావేశంలో జిల్లా సర్పంచులు ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు భూమయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ఆయన ప్రకటించారు. అలాగే ఉపాధ్యక్షులుగా సదాశివపేట మండలం రేజింతల్ సర్పంచ్ గడిల ఆశిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో సర్పంచులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు ముందుంటామని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని, ప్రభుత్వానికి సర్పంచులకు మధ్య వారధిలా వ్యవహరిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెర్యాల సర్పంచ్ రేఖా వెంకట్ రెడ్డి,రాష్ట్ర నాయకులు కీర్తిరామకృష్ణ, సదాశివపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఒగ్గ శ్రీనివాస్, తోపుగొండ సర్పంచ్ లతా వెంకటేష్, జుల్కల్ సర్పంచ్ జుబైర్, మక్త అల్లూరు సర్పంచ్ శివ, చిద్రుప్ప సర్పంచ్ శ్రీశైలం, ఆరుట్ల సర్పంచ్ కృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు...

# 12 వార్డులో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం ప్రారంభించిన కలెక్టర్ ప్రావీణ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మార్చి 24 : సంగారెడ్డి జిల్లా కేంద్రం పోతిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా "100 డేస్ టిబి ముక్త్ భారత్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హాజరై జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన "టిబి ముక్త్ భారత్" కార్యక్రమాన్ని ప్రజలు సక్రమంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో అవగాహన పెంచడం ద్వారా టిబి నివారణ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు నర్సింగ్ విద్యార్థులు టిబి నివారణపై నినాదాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

# 9వ రోజుకు చేరిన రామన్నగూడెం ఆదివాసీల ఆత్మగౌరవ దీక్షలు

## పొట్ట కూటి కోసం భిక్షాటన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామములో ఉన్న భూ సమస్యను పరిష్కారం చేసి ఆ భూములను అప్పగించాలని కోరుతూ భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ఆదివాసీలు చేస్తున్న ఆత్మ గౌరవ దీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించకుండా, ఆ భూములను అప్పగించకుండా నిర్లక్ష్యం వ్యహిస్తున్నారని బాధితులు ఆరోపించారు. నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ఆదివాసీలకు ఆహారం లేక పోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కొత్తగూడెం వైపు ఉన్న షాపుల దగ్గర భిక్షాటన చేస్తున్నారు. భిక్షాటన ద్వారా ఆహారం సేకరించి మా భూములను మేము సాధించే వరకు బిక్షటన చేస్తూ నిరవధిక నిరాహార దీక్ష ను కొన్నసాగించటం జరుగుతుందనీ, భూములను మేము సాధించే వరకు పోరాటం చేయటం జరుగుతుంది అని బిక్షటన చేస్తున్న ఆదివాసీ మహిళలు, పిల్లలు తెలిపారు. ఈ కార్యక్రమములో ఆదివాసీ మహిళలు మాడి దుర్గ, కోర్స వీరమ్మ, సోరేం లక్ష్మి,నారం రాజకుమారి,చిన్న పిల్లలు కూడ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ఆదర్శంగా ఉండాలి - కలెక్టర్ అంకిత్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24 : ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు నాణ్యమైన సేవలకు ప్రతీకలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో పర్యటించిన ఆయన ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో మందులు, రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి, అత్యవసర సేవలు, టీకాలు అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలలో తరగతులు, మధ్యాహ్న భోజనం, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వ సంస్థల్లో సేవల్లో నిర్లక్ష్యం సహించబోదని, లోపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హకీంపేట క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

## ఈనెల 26న చుంచుపల్లి మండల స్థాయి ట్రయల్స్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ, మార్చి 24: హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా చుంచుపల్లి మండల స్థాయి క్రీడా ఎంపికలను ఈనెల 26న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి.నీరజ తెలిపారు. రామవరం గ్రామంలోని భారత్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 8 గంటలకు ఈ ఎంపికలు నిర్వహించబడతాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనదలచిన విద్యార్థులు ముందుగా నమోదు చేసుకున్న దరఖాస్తుతో పాటు అవసరమైన సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు (అసలు), చదువుతున్న పాఠశాల నుంచి వయస్సు, విద్యార్హత సర్టిఫికెట్ (3వ తరగతి), తహసీల్దార్/పంచాయితీ/మున్సిపాలిటీ నుంచి పుట్టిన తేదీ ధృవపత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్/క్రీడా నివేదిక, కమ్యూనిటీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు (6) తీసుకొని రావాలని ఆమె సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయి ఎంపికలకు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

# సత్తుపల్లిలో 'బుల్లెట్' బీభత్సం...

## శబ్ద కాలుష్యంతో బెంబేలెత్తుతున్న పట్టణవాసులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మార్చి 24 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో బుల్లెట్ బైక్ ల విస్తృత శబ్దాలు సామాన్య ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కంపెనీ సైలెన్సర్లను తొలగించి, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే 'మోడిఫైడ్' సైలెన్సర్లను అమర్చుకుని కొందరు యువకులు రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నారు. బాంబు పేలినట్లుగా వచ్చే ఈ శబ్దాల ధాటికి పట్టణవాసులు, ముఖ్యంగా వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు.

**గుండె పగిలేలా కర్ణకఠోర శబ్దాలు:** నిబంధనల ప్రకారం వాహనాల శబ్ద తీవ్రత 80 డెసిబుల్స్ మించకూడదు. కానీ, పట్టణంలో తిరుగుతున్న బుల్లెట్ బైక్లు ఈ పరిమితిని దాటి భయంకరమైన శబ్దాలు చేస్తున్నాయి. ఈ హఠాత్తు శబ్దాల వల్ల వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. చిన్న పిల్లలు సైతం ఉలిక్కిపడి నిద్రలో ఏడుస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనంపై ఆగ్రహం:** పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఇంత జరుగుతున్నా అటు పోలీస్ యంత్రాంగం గానీ, ఇటు మున్సిపల్ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. పోకిరీల ఆగడాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం సైలెన్సర్లు మార్చడం చట్టరీత్యా నేరం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నప్పటికీ, సత్తుపల్లిలో మాత్రం నిబంధనలు అమలు కావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ సైలెన్సర్లను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# విద్యుత్ షాక్‌తో గిరిజన రైతు మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్, మార్చి 24 : వ్యవసాయ క్షేత్రంలోని బోరు స్టార్టర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురైై రైతు మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని శబాద్ గ్రామ పంచాయతీలోని దండువాని కుంట తండాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై అరవింద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన రామావత్ మోత్య (55) మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలోని బోరు వద్ద పంటకు నీరు కోసం మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై అరవింద్ కుమార్ తెలిపారు.

# రామగుండం నగర అభివృద్ధికి సహకరించాలి

## - మేయర్ మహంకాళి స్వామి

## - సింగరేణి సిఅండ్ఎండి బుద్ధ ప్రకాష్‌కు వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), మార్చి 24 : రామగుండం నగర అభివృద్ధికి సహకరిం చాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి సి అండ్ ఎండి కార్యాలయంలో ఆయనను మేయర్ స్వయంగా కలిసి పూల మొక్క బహుమతిగా అందజేశారు. రామగుండం నగర పరిధిలో సింగరేణి ప్రభావిత ప్రాంతం ఎక్కువగా ఉన్నందున కంపనీ సామాజిక భాధ్యతగా నగర అభివృద్ధిలో భాగం పంచుకోవాలని కోరారు. రామగుండం నగరాన్ని స్వచ్ఛ నగరంగా రూపొందించడంలో కలిసి రావాలని కోరారు. సింగరేణి సి అండ్ ఎండి సానుకూలంగా స్పందించినట్లు మేయర్ తెలిపారు.



# ఓటరు జాబితా సమగ్ర సవరణపై శిక్షణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మార్చి 24 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అసిస్టెంట్ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు, అసెంబ్లీ నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగింది. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లుగా ఉన్న తహసీల్దార్లు కనకయ్య, నవీన్ కుమార్ ప్రత్యేక సమగ్ర సవరణపై శిక్షణ ఇచ్చారు. బూత్ లెవెల్ అధికారులు నిర్వర్తించవలసిన విధులు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో టెక్నికల్ మేనేజర్ సంపత్ కుమార్, నాయబ్ తహసిల్దార్ ముజామిల్, ఎలక్షన్ ఐటి పర్సన్ బాబు పాల్గొన్నారు.



# రెసిడెన్షియల్ స్కూల్,అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా స్థానిక అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 24 : నెల్లికుదురు మండలంలోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం జిల్లా స్థానిక అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తరగతి గదులను పరిశీలించరు. ల్యాబ్, సామాగ్రిని, లైబ్రేరీ ని పరిశీలించి విద్యార్థులకు భోదించే పద్దతులను సంబందిత ఉపాద్యాయులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో మాట్లాడి వారిలోని నైపుణ్యాలను తెలుసుకున్నారు.విద్యార్థులకు అర్థమయ్యే పద్దతిలో ఉపాద్యాయులు భోదించాలని అన్నారు.పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని,తాగునీరు,విద్యుత్ సౌకర్యాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ లో అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ తదితరులు ఉన్నారు.





# పాఠశాల ఆవరణంలోని పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి - పిల్లలకు డైట్ మెనూ ప్రకారం ఆహారం అందించాలి**
**- షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**
**- కురవి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 24 : జిల్లా కలెక్టర్ కురవి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్ తరగతి గదులు పరిసరాలను పరిశీలించారు. విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే కామన్ డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలని,ప్రతిరోజు అందించే ఆహారంలో నాణ్యత,ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని,షెడ్యూలు ప్రకారం పిల్లలకు,సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని,పాఠశాల ఆవరణంలోని పెండింగ్ లో ఉన్న టాయిలెట్,కిచెన్ షెడ్,వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధుల ప్రబలకుండా షెడ్యూల్ ప్రకారం నిర్వహించవలసిన ఆరోగ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని,కావలసినన్ని మెడిసిన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని,వేసవికాలం నేపథ్యంలో తగిన ఏర్పాట్లను చేయాలని ప్రజలకు వేసవి తీవ్రత ఆరోగ్య స్థితిగతులపై అవగాహన కల్పించాలన్నారు. మండల పరిధిలో ఉన్నటువంటి వసతి గృహాలు పాఠశాలలలో వైద్య పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి అట్టి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పాఠశాల, వైద్యశాల తదితర ప్రదేశాలలో నిత్యం పరిశుభ్రంగా ఉంచుకొని సానిటేషన్ నిర్వహించాలని సూచించారు. మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో మంజూరు అయిన 18 ఇందిరమ్మ ఇండ్ల లో ఇప్పటివరకు 10 స్లాబ్ లెవల్, జగ్గయ్య తండా లో 15 మంజూరు కాగా అందులో 9 స్లాబ్ లెవెల్ పూర్తి అయ్యాయని అన్నారు.

మిగతా ఇంటి నిర్మాణం కోసం సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్స్ పంచాయతీరాజ్ రెవెన్యూ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పూర్తిచేసిన లెవెల్ వరకు ఆన్లైన్ ద్వారా నమోదు చేసి డబ్బులు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని సాధ్యమైనంత త్వరగా వారికి ఇండ్ల నిర్మాణానికి సహకరించి,మెటీరియల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,వసతి గృహాలు,విద్యాసంస్థలను అధికారులు తనిఖీ చేసి కామన్ డైట్ మెనూ,విద్య ఆరోగ్యం సానిటేషన్ తదితర అంశాలపై దృష్టి పెట్టి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హనుమ నాయక్,కురవి తహసిల్దార్ విజయ,ఎంపీడీవో కె. వీరబాబు,మండల విద్యాశాఖ అధికారి బలోజీ తదితరులు ఉన్నారు.



# లచ్చ నాయక్‌కు నివాళి అర్పించిన మందకృష్ణ మాదిగ

**- హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించి,**
**- వారి అనుభందాన్ని గుర్తుచేసిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక**
**- అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 24 : జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చ నాయక్ ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని ఆయన స్మారకార్థం నిర్వహించిన నివాళి కార్యక్రమంలో జాతీయ నాయకులు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆయన స్వగృహం గూడూరు మండలం, ముచ్చర్ల గ్రామానికి విచ్చేసి హుస్సేన్ నాయక్ తండ్రి స్వర్గీయ లచ్చ నాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న హుస్సేన్ నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను మందకృష్ణ మాదిగ ఓదార్చి ధైర్యం కల్పించారు. తండ్రిని కోల్పోవడం ఆ కుటుంబానికే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని అన్నారు. హుస్సేన్ నాయక్ తల్లిని కలిసి తన బాగోగులు తెలుసుకొని, ధైర్యం చెప్పి దేశ స్థాయిలో పేరు తెచ్చుకంటున్న మంచి కొడుకులకు జన్మనిచ్చిన మీకు మీ కొడుకులకు మంచి పేరు, ప్రతిష్టలు దేశస్థాయిలో పెరిగాయాని మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా కొనియాడి వారి కటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్,బీజేపీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి,గుగ్గిళ్ల పీరన్న గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య గౌడ్, మాజీ ఎంపీపీ వెంకన్న,తండ సంపత్ కుమార్ గౌడ్, చీకటి కిరణ్,ఎం ఆర్ పి ఎస్ జిల్లా,మండల నాయకులు,బీజేపీ నాయకులు పాల్గొన్నారు..

# మూసీనది ప్రక్షాళనకు కావలసిన నీరు మల్లన్న సాగరే...!

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 24 : మూసీ నది ప్రక్షాళనకు కావలసిన నీరు బిఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన మల్లన్న సాగర్ నీరేనని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ బడ్జెట్ సమావేశాలు 2026-27లో భాగంగా జరిగిన చర్చలో "వాస్తవానికి దూరంగా ఊహలలో అభివృద్ధిని చూపుతూ" ప్రభుత్వం చెబుతున్న అంకెల గారడిపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తనదైన శైలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సీఎల్పీ నేతగా ఉన్న బట్టి విక్రమార్కకి, శ్రీధర్ బాబుకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బడ్జెట్‌పై సమగ్ర అవగాహన ఉందని, బడ్జెట్‌పై సమగ్ర అవగాహన ఉన్న వీరు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధిలో భాగంగా చేసిన అప్పులు గతంలో బకాయిలు తెలవక ఇప్పుడేదో తెలిసినట్టు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి మూడవ బడ్జెట్లో కూడా ఆరు గ్యారెంటీ లపై ఇంకా స్పష్టత లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను చట్టబద్దత చేసేందుకు మా నాయకులు ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లును అనుమతించి చట్టబద్ధత చేయాలి డిమాండ్ చేసారు. వన్ ట్రిలియన్ ఎకానమీ, 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ చేస్తామని గొప్పలు చెబుతున్న అసలు వన్ ట్రిలియన్ అంటే ఎంతో ప్రభుత్వానికి తెలుసా అని అడుగుతా ఉన్నానని ప్రశ్నించారు. ఒక ట్రిలియన్ డాలర్ అంటే 93 లక్షల కోట్లు, మూడు ట్రిలియన్ డాలర్ అంటే 280 లక్షల కోట్లని 2047 నాటికి 3, ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించాలంటే రాబోయే 8 ఏళ్లలో వరుసగా ప్రతి సంవత్సరం 20.7% వృద్ధి సాధించాలని తెలిపారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇంతలా అభివృద్ధి అమెరికా, చైనా, జపాన్ వంటి దేశాలతో కూడా కాలేదు. కానీ మీరు మాత్రం 3 ట్రిలియన్ సంపదతో వృద్ధి సాధిస్తాం అంటున్నారు. ఇందులో నిజం లేదనే నేను అభిప్రాయపడుతున్నానని తెలిపారు. 3 ట్రిలియన్ వృద్ధి సాధించేందుకు ఏం మాయ చేస్తారు, ఎట్లా చేస్తారో అనేదానిని ప్రజలకు చెప్పాలని కోరారు. కరోనా, జీఎస్టీ, నోట్ల రద్దు వంటి సమయంలో కూడా 12.5% తలసరి ఆదాయంతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేసారు. నేడు రాష్ట్ర తలసరి ఆదాయం 10.3% కి ఎలా పడిపోయిందో చెప్పాలని కోరారు. ఆగిన అభివృద్ధిని ఎలా ముందుకు తీసుకెళతారో చెప్పాలని ప్రశ్నించారు. 20.7% అభివృద్ధి మాటలు చూస్తుంటే గాల్లో మేడలు కట్టినట్టు ఉందని మాట్లాడారు. మీరు చెప్పిన 20.7% అభివృద్ధి మాటలకు, చేతలకు పొంతన ఉంటేనే సాధ్యమౌతుందన్నారు. కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం పైనే అబద్ధపు మాటలను ప్రజలకు చెబుతూ ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు అదే కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద ఉన్న మల్లన్న సాగర్ నుంచే మూసీకి నీళ్లను తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. కాళేశ్వరం పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. పార్లమెంట్ ఎకానమీ సర్వేలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 1.3 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి 2023 నాటికి 2.3 కోట్ల ఎకరాల సాగు విస్తీర్ణానికి చేరిందని, ఇందుకు ప్రధాన కారణం కాళేశ్వరం, మిషన్ కాకతీయ పథకాలు, ప్రాజెక్టులేనని స్పష్టం చేసారు. తెలంగాణ రాష్ట్రం దివాళా తీయలేదని, 16వ ఆర్థిక సంఘం లెక్కల ప్రకారం స్పష్టమైందన్నారు. అంతే కాక 2022-23 లెక్కల ప్రకారం అభివృద్ధిలో గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల కంటే ఎంతో ముందుందన్నారు. 80 శాతం సొంత రాబడితో తెలంగాణ దేశంలోనే నెంబర్.1 స్థానంలో నిలిచిందన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం 14 వేల ఎకరాలను సేకరిస్తే అడ్డుకుంది ఎవరని ప్రశ్నించారు. మేము అధికారంలోకి వస్తే రైతుల భూములను వెనక్కి ఇస్తాం అన్న మీరు ఇప్పుడు 14 వేల ఎకరాలకు మరో 16 వేల ఎకరాలను సేకరించి ముప్పై వేల ఎకరాలతో ఫోర్త్ సిటీ అంటున్నారని, ఎప్పుడూ సేకరిస్తారని దానిపై స్పష్టత లేదని తెలిపారు. మేము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, ఇళ్లను కూల్చకుండా చేయండని, దౌర్జన్యంగా తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. రెండు లక్షల పెన్షన్లు ఇస్తామంటున్నారు... 19 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం... అవి పెండింగ్ లోనే ఉన్నాయని తెలిపారు. ప్రజలను వేధించి అరాచకం చేసేవాడు, నా రాజు కాలేడు, నా మంత్రి కాలేడు. ప్రజలకు ఎప్పుడూ సేవకుడిగా ఉండాలని స్పష్టం చేసారు.



# "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు" అందుకున్న డీఎంహెచ్ఓ డా.రవి రాథోడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 24 : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్,హైదరాబాద్ వారి చేతుల మీదుగా మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్‌కి టిబి నియంత్రణ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు" ను మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ టిబి నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు వినియోగించుకోవాలని,లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టిబి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని,నిరంతరంగా మందులు వాడటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలో టిబి కేసులను గుర్తించడం,సమయానికి చికిత్స అందించడం,అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాల్లో వైద్య సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా ఈ పురస్కారం లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ టిబి పై అపోహలను విడిచిపెట్టి ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం

**- తక్షణ పారిశుధ్య చర్యలకు ఆదేశాలు-పనులు వేగవంతం చేయాలి**
**- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మార్చి 24:పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా మార్చాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహాముత్తారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన ఆయన, ఇది విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితి అని పేర్కొన్నారు. అపరిశుభ్రత కారణంగా విషజంతువులు వచ్చే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టి పాఠశాల పరిసరాలను పూర్తిగా శుభ్రపరచాలని, చేపట్టిన పనుల ఫోటోలను తనకు పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు. ఈసందర్భంగా పాఠశాలకు వెళ్లే రహదారి పనులు ఇంకా పూర్తికాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాప్యానికి గల కారణాలను తెలుసుకొని, రహదారి మరియు విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంచినీటి సరఫరా అంశంపై మిషన్ భగీరథ అధికారులను పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం కలెక్టర్ 10వ తరగతి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ప్రకాష్, సర్పంచ్ బాబులు పాల్గొన్నారు.



# విరివిగా జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**- పేదల ప్రాణాలకు చౌక మందులే ఆధారం**
**- డిఎస్ఎస్‌డబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్**

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : ప్రజల ఆరోగ్యం రోజు రోజుకూ ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. ప్రాణాలను కాపాడే మందుల ధరలు విపరీతంగా పెరగడంతో, సాధారణ ప్రజలు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు వ్యాధి బాధ, మరోవైపు మందుల ఖర్చు... ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, తక్కువ ధరలకు మందులు అందించేందుకు ప్రధాన్ మంత్రి భారతీయ జనఔషధి పరిజ్ఞాన పథకం (పిఎంబిజెపి) ద్వారా దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రాల్లో నాణ్యమైన మందులు చాలా తక్కువ ధరలకు అందుబాటులో ఉంటాయి. అయితే, ప్రజల అవసరాలకు సరిపడే విధంగా ఈ కేంద్రాల సంఖ్య మాత్రం చాలా తక్కువగా ఉండటం వల్ల, అందరికీ ఈ సదుపాయం చేరడం లేదు. ఇదే సమయంలో, ప్రైవేట్, కార్పొరేట్ ఫార్మసీ దుకాణాలు ప్రత్యేక సభ్యత్వాలు, డిస్కౌంట్ ఆఫర్లు పేరుతో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. తక్కువ ధరలకు మందులు, పరీక్షలు అందిస్తామని ప్రచారం చేస్తూ, వారిని తమవైపు మళ్లించుకుంటున్నాయి. కానీ దీని వెనుక ఉన్న వ్యాపార ధోరణి కారణంగా ప్రజలు చివరకు అధిక ఖర్చులు భరించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో డెమొక్రటిక్ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, ప్రైవేట్, కార్పొరేట్ ఫార్మసీ యజమానుల దోపిడీని అరికట్టాలంటే ప్రతి గ్రామం, పట్టణంలో జన ఔషధి కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మందుల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి రావడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఆరోగ్యం హక్కు... అది వ్యాపారం కాకూడదు" అనే భావనతో ప్రభుత్వాలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని, జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన పెంచడమే కాకుండా, వాటిని సులభంగా అందించే వసతులు కూడా కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడే మందులు అందుబాటులో లేకపోతే, ఆ సమాజం అభివృద్ధి సాధించలేదనే మాట వాస్తవం. కాబట్టి, చౌక ధరలకు నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా జన ఔషధి కేంద్రాలను ప్రతి మూలకూ విస్తరించడం... ఇప్పటి అత్యవసర కర్తవ్యంగా మారింది.



# కొత్తగూడెం నుంచి తిరుపతి, షిరిడికి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలి

**రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వ్యాపారస్థుల వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి తిరుపతి మరియు షిరిడికి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కొత్తగూడెం ప్రాంత వ్యాపారస్థులు రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు వారు కొత్తగూడెం రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుపతి, అలాగే షిరిడి శ్రీ సాయిబాబా దర్శనార్థం వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అయితే నేరుగా ప్రయాణ సౌకర్యం లేకపోవడంతో ఖమ్మం లేదా విజయవాడ వెళ్లి అక్కడి నుంచి రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి నేరుగా ప్రత్యేక రైళ్లు నడిపితే భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం కలుగుతుందని, రైల్వే శాఖకు కూడా ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతాలైన కేటిపిఎస్, నవభారత్, అలాగే పుణ్యక్షేత్రమైన భద్రాచలం వంటి ప్రాంతాలకు సమీపంగా ఉన్న కొత్తగూడెం నుంచి ప్రత్యేక రైళ్లు ప్రారంభించడం అత్యవసరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ, దుర్గ ప్రసాద్, రాహుల్, లక్ష్మణ్, తిరుపతయ్య, పవన్, రాజేష్, శంకర్, కృష్ణమూర్తి, చిన్న స్వామి, కాశి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సబ్సిడీలను లబ్ధిదారుల ఎకౌంట్లో జమ చేయాలి

**కొత్తగూడెం కార్పొరేటర్ మునిగడప పద్మ డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 24 : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యాస్ సిలిండర్ హామీ సబ్సిడీని తక్షణమే విడుదల చేయాలని భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 16 వ డివిజన్ కార్పొరేటర్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా నాయకురాలు మునిగడప పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రామవరం 16వ డివిజన్లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు మూడు హామీలను ఇవ్వడం జరిగిందని, అందులో కేవలం ఉచిత బస్సు పథకం మాత్రమే అమలవుతుందని మునిగడప పద్మ తెలిపారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు పరస్తామన్న ప్రజా ప్రభుత్వం కేవలం గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించి రెండు మూడు నెలలు మాత్రమే లబ్ధిదారుల ఎకౌంట్లో 500 రూపాయల సబ్సిడీ వేసి చేతులు దులుపుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక పెన్షన్ల 4000 మరియు వికలాంగుల పెన్షన్లు 6000 పెంచుతామని మొదటి సంతకం పెట్టి నేటికీ అమలు కాకపోవడం వల్ల వృద్ధులు ,వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు వారి కళ్ళకు కాయలు కాసేటట్లుగా ఎదురుచూస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి పథకంలోని గ్యాస్ సిలిండర్ సబ్సిడీ,మరియు ప్రతి ఇంటి మహిళకు 2500 రూపాయలు మంజూరు చేయాలని ఆమె ప్రజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహిళలు నాయకురాలు బెల్లం బేబీ ,రావిశెట్టి పద్మ, జయమ్మ ,మాధవి ,శాంతి ,జమున ఆసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

# మరణంలోనూ మహోన్నత సేవ

**- ఇద్దరికీ వెలుగునిచ్చిన కొయ్యడ శ్రీనివాస్**
**- ఖనిలో గుండెపోటుతో ఫోటో గ్రాఫర్ మృతి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మార్చి, 24 : గోదావరిఖనిలోని కాకతీయ నగర్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ కొయ్యడ శ్రీనివాస్ (42) సోమవారం సాయంత్రం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జీవించి ఉన్నప్పుడే తన కెమెరాతో ఎన్నో జీవితాలకు వెలుగులు నింపిన శ్రీనివాస్ మరణానంతరం కూడా ఇద్దరికీ చూపు అందించి నిజమైన మంచితనాన్ని చాటుకున్నారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు సూచనలతో, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి భాస్కర్ మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. "శ్రీనివాస్ నేత్రాలు ఇద్దరికీ చూపు ఇస్తాయి" అన్న మాటలు వారి హృదయాలను తాకాయి. తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, మానవత్వానికి అంకితమవుతూ కుటుంబ సభ్యులు గొప్ప నిర్ణయం తీసుకుని నేత్రదానానికి అంగీకరించారు. బుధవారం వరంగల్ నుంచి ప్రత్యేకంగా గోదావరిఖని వచ్చిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సహకారంతో మృతుని కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించిన తల్లి గౌరమ్మ, భార్య సుజాత, పిల్లలు రిషికేష్, మనశ్రీని, అక్క శారద--బావ తిరుపతి, సోదరుడు కిరణ్, బంధువులు మిట్టపల్లి మహేందర్, నోముల సతీష్, సుమన్, సంగెం రాజు, సదిరం రాజేశం, చిలుక అంజయ్య తదితరులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, రామగుండం లైన్స్ క్లబ్ సభ్యులు హృదయపూర్వకంగా అభినందిం చారు. అంతిమయాత్రలో కూడా ఒక వెలుగుదీపంలా నిలిచిన శ్రీనివాస్ తన జీవితం ముగిసినా, మరొకరి జీవితాల్లో కొత్త ఉదయం తీసుకొచ్చాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు నేత్రదాతకు అంత్యక్రియలు నిర్వహించారు.

## టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం మార్చి 24 : మండల కేంద్రం లోని రైతు వేదికలో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుం టున్న వారితో ఆమె శిక్షణపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒక మంచి ఉద్దేశంతో పేదవారికి భవిష్య త్తులో ఉ పాధి కలిగే విధంగా ప్రణాళికలు రూపొంచామని, ట్రైనింగ్ శ్రద్ధగా ఉండి అందరు కూడా సద్వినియోగంచేసుకోవాలని ఆమె అన్నారు. అదేవిధంగా ట్రైనర్స్‌తో మాట్లాడి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం రవీందర్ గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కార్యక్రమము, వసతులు క్వాలి టీగా ఉండే విధంగా చూసు కోవాలని ఆమె ఆదేశించా రు. ఈకార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫర్జానా బేగం, డిపిఎం (నాన్‌ఫామ్) గోవింద్, ఎంపిడిఓ అద్దూరి బాబు, ఎంపీఓ పిల్లి వీరస్వామి, సీసీలు, పంచాయతి కార్యదర్శి శగిర్ ఖాన్, ట్రైనర్లు, శిక్షణ తీసుకుంటున్నవారితో పాటు తదితరులు పాల్గొ న్నారు.



## మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 24 : కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మీ-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్య పరీక్షలకు 27 మంది హాజరు కాగా వారిలో 12 మందికి శస్త్రచికిత్స అవసరమని ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. గత మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి ఈ రోజు 13మందికి ఆపరేషన్ కోసం నేడు బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించినట్లు ఆయన తెలిపారు. డా. కొత్తపల్లి శ్రీనివాస్, అనంతరం వారు మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్, గోపి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు...



## శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం

### గడీల శ్రీకాంత్ గౌడ్‌ని ఆహ్వానించిన రామ్ సేన యూత్ సభ్యులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చేరు, మార్చి 24 : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశంమైలారం వార్డులోని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని పటాన్ చెరు మండల ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, అలాగే ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి పాశం మైలారం రామ్ సేన యూత్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామ యువత సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ, ప్రము ఖులను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో రామ్ సేన యూత్ సభ్యులు సంతోష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, కృష్ణ గౌడ్, నరేష్ గౌడ్, బాల్ రాజ్ యాదవ్, బాల్ రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బస్వాపూర్ ఆర్ & ఆర్ లే అవుట్‌లపై కలెక్టర్ దృష్టి

### - పెండింగ్ పనులు వేగవంతం చేయాలనీ ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మార్చి 24 : బస్వాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించిన పునరావాసం మరియు పునర్వ్యవస్థీకరణ (ఆర్ ఉ ఆర్) ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్న భువనగిరి మండలం బి.ఎన్. తిమ్మాపురం, లప్నానాయక్ తండా లే అవుట్‌లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డితో కలిసి మౌలిక వసతుల పనుల పురోగతిని సమీక్షించారు. లే అవుట్‌లలో కొనసాగుతున్న, పెండింగ్‌లో ఉన్న పనులపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్, ఇంకా ప్రారంభించాల్సిన పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నివాసితులకు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలను త్వరితగతిన అందించాలని సూచించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలనీలోకి వెళ్లే మట్టి రహదారులను చదును చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జగన్మోహన్ ప్రసాద్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





# క్షయ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకం

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, - ప్రపంచ క్షయ దినోత్సవంలో భాగంగా - జిల్లాలో 100 రోజుల 'టిబి ముక్తి భారత్' కార్యక్రమం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మందమర్రి మార్చి 24 : క్షయ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా 'టిబి ముక్తి భారత్ అభియాన్'లో భాగంగా 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అందుగులపేట గ్రామపంచాయతీలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెంపొందించడం, తొందరగా నిర్ధారణ, సమయానికి చికిత్స అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, దగ్గుతో రక్తం, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్షలు, ఎక్స్-రేలు, ఉచిత చికిత్సలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 14 సంవత్సరాల పైబడిన వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ, ఇతర అసంక్రమణ వ్యాధులను కూడా గుర్తిస్తున్నట్లు తెలిపారు. అలాగే క్షయ రోగులకు నిక్షయ పోషణ యోజన కింద ప్రతి నెల రూ.1000 ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 759 మంది రోగులకు చికిత్స అందుతుండగా, 150 మందికి డిబిటి ద్వారా రూ.6000 చొప్పున పోషకాహార సహాయం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా దగ్గు, తుమ్ము సమయంలో మాస్క్ ధరించడం, గాలి, వెలుతురు ఉన్న ప్రదేశాల్లో ఉండడం వంటి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రశంసా పత్రాలు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 24 : వైద్యం కొరకు వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు రిజిస్టరు, మందుల నిల్వల గదిని, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి వైద్యం కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సమయపాలన, అనుమతి, లేకుండా గైర్ హాజరు అయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థుల హాజరు పట్టిక, మెను పట్టిక, సరుకుల నిల్వల గది,వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని మెను ప్రకారం పెట్టాలన్నారు. విద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన బోధనను అందించి, విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి సారించాలని విద్యార్థులకు అర్థమయ్యే పద్దతిలో బోధించాలన్నారు. అంతకుముందు మండలంలోని బొంబాయి గూడా గ్రామంలో గల ఆదర్శ అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అంగన్వాడి ఉపాధ్యాయురాలిని ఎంతమంది గర్భిణీ స్త్రీలు వున్నారు. వారిలో డెలివరీకి ఎంతమంది ఉన్నారు. వారికి క్రమం తప్పకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయురాలిని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా శ్యాం, మామ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీ యు పి ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థులు 100% పాఠశాలకు వచ్చేలా ఉ పాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్దతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన అవసరం

### - క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం కీలకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




మంచిర్యాల మార్చి 24 : మార్చి 24న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ క్షయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. క్షయ వ్యాధి గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధి. అత్యధికంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేసే ఈ వ్యాధి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు వంటి లక్షణాలతో బయటపడుతుంది. రెండు వారాలకు పైగా దగ్గు కొనసాగితే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం క్షయ నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తూ రోగులను పూర్తిగా నయం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. సమయానికి గుర్తించి చికిత్స తీసుకుంటే క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించడం, దగ్గు వచ్చినప్పుడు నోరు కప్పుకోవడం, వైద్యుల సూచనలు కచ్చితంగా పాటించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు. సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని క్షయ నిర్మూలనకు సహకరించాలని ఆరోగ్య శాఖ అధికారులు కోరుతున్నారు. "క్షయంపై పోరాటంలో ప్రజల భాగస్వామ్యం కీలకం" అని వారు పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకెళ్లడమే ఆయన లక్ష్యం

### - పలు అభివృద్ధి అంశాలను శాసనసభ దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మార్చి 24 : వనపర్తి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్న సంకల్పమే పరమావధిగా భావించి ప్రతిక్షణం అభివృద్ధి ఆలోచనలతోనే ముందుకు సాగుతున్నారు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఈ క్రమంలో మంగళవారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించారు. వనపర్తి నియోజకవర్గంలో హామ్ ప్రాజెక్టు ద్వారా పలు రహదారుల అభివృద్ధి కోసం రూ. 400 కోట్లతో టెండర్లు పిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇందులో భాగంగా వనపర్తి గోపాల్పేట్ బిజినపల్లి వనపర్తి ఖిల్లా ఘణపురం మొల్గర వనపర్తి కొత్తకోట నాలుగు లైన్ల రహదారి వనపర్తి పట్టణ శివారు, రోడ్డు వైన్డింగ్ సంబంధించిన డ్రైనేజీల నిర్మాణం కోసం 25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే పెబ్బేరు మున్సిపాలిటీ కోసం మరో 5 కోట్లు మంజూరు చేసేందుకు ప్రపోజల్సు ఇచ్చినట్లు ఎమ్మెల్యే శాసనసభ్యులు తీసుకొచ్చారు. వనపర్తి నుంచి పెబ్బేరు మున్సిపాలిటీకి ఉన్న 20 కిలోమీటర్ల పొడవున్న రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చాలని ఆ రహదారి కర్నూలుకు లింక్ అయి ఉండటం వల్ల హెవీ ట్రాఫిక్ ఉంటుందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత మంత్రులకు సమర్పించినట్లు ఆయన చెప్పారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఆర్ యన్ బి సంబంధించి యస్ సి కార్యాలయం నిర్మాణం చేపట్టేందుకు సంబంధించిన నివేదికలను మంత్రికి అందించినట్లు అందుకు సంబంధించింది మంజూరి చేయవలసిందిగా ఎమ్మెల్యే కోరారు.

## తబిత ఆశ్రమ పిల్లల మధ్య పరశురాములు 37వ వర్ధంతి

### - అన్న ఆశయాలే స్ఫూర్తి - మాజీ జెడ్పిటిసి నారాయణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామగుండం, మార్చ్ 24 : చదువుతోపాటు మానవ సమాజ జీవితాన్నితడిమి దోపిడి పీడన లేని సమాజం కోసం తన వంతు కర్తవ్య బాధ్యతలను గుర్తించి పోరు పిడికిలెత్తి విద్యార్థుల సమస్యలపై గళమెత్తి ప్రగతిశీల విద్యార్థి నేతగా ఎదిగి చివరి ఊపిరి వరకు పోరు మార్గంలో నడిచిన వేముల పరశురాములు సోదరునిగా అతని ఆశయాలే తనకు స్ఫూర్తి అని అంతర్గాం మండల తాజా మాజీ జడ్పిటిసి బిఆర్ఎస్ సీనియర్ నేత ఆముల నారాయణ అన్నారు. మంగళవారం అమరుడు పరశురాములు 37వ వర్ధంతి సందర్భంగా తబిత ఆశ్రమంలో పిల్లల మధ్య పరశురాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. జనపోరులో సాగుతూ దొరలు భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాల నిర్మాణం చేస్తూ దొరతనం వెట్టి కులాల అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పరశురాములును అరాచక శక్తులు దారి కాచి హత్య చేశాయని పరుశు రాములును హత్య చేసిన అతని ఆశయాలు లక్ష్యాలు తమ వెంట ప్రజల్లో ఉంటాయని మాజీ జెడ్పిటిసి ఆముల నారాయణ అన్నారు. అనంతరం తబిత ఆశ్రమ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఆముల నారాయణ, విజయనిర్మల, పృథ్వి, మనీషా, సీనియర్ జర్నలిస్ట్ కోల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ఆముల శ్రీనివాస్, బండి తిరుపతి, పైడిపల్లి వెంకటస్వామి, లగిశెట్టి రవి, ఈసంపల్లి తిరుపతి, బోయపోతు మల్లేష్, సొల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ దండేవిట్టల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 24 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మినిస్టర్ జూపల్లి కృష్ణారావు ని మంగళవారం హైదరాబాద్ లో ఎమ్మెల్సీ దండే విట్టల్ మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ అహ్మద్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీలో గల సమస్యల పైన చర్చించారు. అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్ కాంగ్రెస్ నాయకులు యూసఫ్ ఖాన్ ,కావేటి విజయ్, సూరజ్ మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కల్లూరు నుండి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు

### డిపో మేనేజర్ పండరి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




నిర్మల్ మార్చి 24 : ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో బుధవారం నుండి కుంటాల మండలం కల్లూరు నుండి హైదరాబాద్ కు సూపర్ లగ్జరి బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే.పండరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజు రాత్రి 9.45 నిమిషాలకు కల్లూరు నుండి బయలుదేరి నర్సాపూర్ (జి) నుండి రాత్రి 9:55 దిలవార్‌పూర్ నుండి రాత్రి 10.05 నిమిషాలకు నిర్మల్ నుండి రాత్రి 10.45 నిమిషాలకు బయలుదేరి మరుసటి రోజు ఉ దయం 03.50 నినిమిషాలకు హైదరాబాద్ చేరుకుం టుందని ఆయన తెలిపారు. ఈ బస్సు 4 మండలాల ప్రజలకు అనుకూలంగా ఉ ంటుందని కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్ (జి), దిలవార్ పూర్ మండల ప్రజలు (ప్రయాణికులు) ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని డిపోమేనేజర్ తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కొరకు tgsrtcbus.in ద్వారాటికెట్లుబుక్ చేసుకోవాలనిఆయన సూచించారు. రిజర్వేషన్ లో ఏమైనా సందేహాలు ఉంటే 7382842394 పై నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవలని ఆయన తెలిపారు.



## కోదండరామ ఆలయ పరిసరాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మార్చి 24 : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్క రించుకొని పట్టణంలోని జనకాపూర్లోని శ్రీ కోదండరామ ఆలయం వద్ద మంగళవారం మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ముమ్మరం గా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్, స్థానిక కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మున్సిపల్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఆలయ పరి సరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వేడుకల కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండు భారతి, చిలువేరు వెంకటేశ్వర్లు, జాడి వినోద్, నాయకులు సిహెచ్ రవి, శైలేష్‌లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, మార్చి 24 : మెనూ ప్రకారం భోజనం అందిం చాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండలం అందర్ బంద్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, సరుకు నిల్వల గది, భోజన శాల, వసతి గృహాలను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎప్పటికపుడు రిజిస్టర్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆర్ఓ ప్లాంట్ నీటి నాణ్యతను క్వాలిటీ మీటర్ తో కొలిచి చూశారు. స్టోర్ రూమ్ లో బియ్యం,గుడ్ల నాణ్యతను పరిశీలించి నాణ్యత లేని వాటిని తిరిగి పంపించాలని అందేశించారు. అనంతరం ఆర్‌బిఎస్‌కే వైద్య బృందం అధికారు లను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసు కున్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రమేష్, హెచ్‌డబ్ల్యుఓ జ్ఞానేశ్వర్, ఆర్‌బిఎస్‌కే వైద్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గూడెం హుండీ లెక్కింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, మార్చి 24 : దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. 2025 డిసెంబర్ 20నుండి 2026 మార్చి 23వరకు 94రోజులకు గాను 6,67,205 రూపాయల ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణ అధికారిగా నవీన్ కుమార్, సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చ కులు సిబ్బంది, సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌ను జీర్ణించుకోలేని బిఆర్ఎస్



- ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు
- విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా
- మహిళలను కోటీశ్వరులను చేయాలనుకోవడం తప్పా
- బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా
- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా
- బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 24 : బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు.

ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో బడికి రావద్దన్న ఆలోచనతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా, ఇంటర్ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం బ్జడెట్ కాగితాలు చించి చెవిలో పెట్టుకుని వెళ్ళిపోయారని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూ, ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని, గత ప్రభుత్వంలాగా ఓట్ల కోసం ఔటర్ రింగ్ రోడ్డును కుదువబెట్టి డబ్బులు పంచే సంస్కృతి తమది కాదని హితవు పలికారు. సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. మత, ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క వివరించారు. వ్యక్తులుగా తాము చిన్నవాళ్ళం కావచ్చు కానీ, తాము చేపట్టిన ప్రజాస్వామ్య పక్రియను మన్నించి చర్చలో పాల్గొనాల్సింది పోయి, 'ఆడలేక మద్దెలో ఓడు' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన ప్రసంగాన్ని ముగించారు.





## ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా రెవిన్యూ అధికారి చంద్రావతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 24: గృహాలకు శాశ్వత విద్యుత్ పరిష్కారానికి, పర్యావరణ మేలు కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన పథకంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రావతి పేర్కొన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన పథకానికి సంబంధించిన ప్రచారానికి గాను మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవిన్యూ అధికారి చంద్రావతి ప్రచార వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాపడుతు కోటి కుటుంబాలకు లబ్ది చేకూర్చేందుకు లక్ష్యంగా ఏర్పాటైన ఈ పథకం క్రింద, గృహ వినియోగదారులు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంటును ఏర్పాటు చేసుకుని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చుని, ఇట్టి అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు. ఉదయం 9 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్ డెస్క్ 080-46733622, 46733633 అందుబాటులో ఉంటుందని తెలిపారు. టారిఫ్, సబ్సిడీ, అదనపు ఆదాయం లాంటి ఇతర వివరాలకు www.pmsuryaghar.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని రెనెవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివ రావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి శేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ ఓం ప్రకాష్, విలాస్ రావు, ఆనంద్, సంతోష్, మోహమ్మద్ మజర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు

### ఫార్మూలా రేస్‌లో న్యాయస్థానంలో పోరాడుతాం

### అందాల పోటీలతో సాధించిందేమిటో చెప్పాలి: కెటిఆర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మార్చి 24 : ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేశారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎవరికి అనుచిత లబ్ది చేకూర్చామని ఆరోపిస్తున్నారో.. వారి పేరే లేదని చెప్పారు. ఈ కేసులో న్యాయపోరాటం చేస్తామని... న్యాయస్థానాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. రూ.200 కోట్లతో నిర్వహించిన మిస్‌వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? అని ప్రశ్నించారు. ఎన్ని చేసినా ఆరు గ్యారంటీలు అమలు చేసేవరకు పోరాడతామన్నారు. 'ఈ కేసులో ఏమీ లేదని ఛార్జిషీట్‌లో ప్రభుత్వం మళ్లీ అంగీకరించింది. మేం కట్టింది రూ.45 కోట్లయితే.. రూ.500 కోట్లు, రూ.600 కోట్లు అని చెబుతున్నారు. విధానపరమైన లోపం ఉన్నట్లుందని ఛార్జిషీట్ ద్వారా తెలుస్తోంది. తప్పు జరిగితే.. బ్యాంకు ఖాతాలోని డబ్బును ఎందుకు రికవరీ చేయలేదు? ఈ కేసులో ఏమీ లేదని నేను మొదట్నుంచీ చెబుతున్న విషయాన్ని ప్రభుత్వం ధ్రువీకరించింది. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో హైదరాబాద్‌ను ప్రపంచపటంలో పెట్టేందుకు చేసిన ప్రయత్నమే ఫార్ములా ఈ-కార్ రేస్' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

### క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు

### క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు

### హిందువుల, సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు

### ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 24 : మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్త్రవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్త్రవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్త్రవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని,



ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరపు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్త్రవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్త్రవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్త్రవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

### మండిపడ్డ విపక్ష నేత రాహుల్ గాంధీ



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ,మార్చి 24 :పశ్చిమాసియా ఉద్రిక్తతలను గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపాయారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. 'పార్లమెంటులో ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు' అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. 'మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు. అమెరికా ఏది చెబితే అది మోదీ చేస్తారని, రైతులు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని విమర్శించారు. కేరళలో తనకు ప్రోగ్రాం ఉన్నందున అఖిల పక్ష సమావేశానికి హాజరుకాకపోవచ్చని చెప్పారు.

# సినిమా న్యూస్






## గ్లామర్ క్వీన్ శోభిత... ఎల్ కవర్‌పై కొత్త స్టైల్‌తో సందడి!

గ్లోబల్ బ్యూటీ శోభిత ధూళిపాళ్ల మరోసారి ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వేదికపై తన ముద్ర వేసింది. ప్రతిష్టాత్మకమైన 'ఎల్' (జూూజు) మ్యాగజైన్ 'ది ఆర్ట్ ఇష్యూ' కోసం కవర్ స్టార్‌గా మారి అందరి దృష్టిని ఆకర్షించింది. తనదైన స్టైల్, గ్రేస్ మరియు అదిరిపోయే యాటిట్యూడ్‌తో శోభిత చేసిన ఈ ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవలం గ్లామర్ మాత్రమే కాకుండా, తన ఆలోచనలతో కూడా మెప్పిస్తున్న ఈ బ్యూటీ గురించి మరిన్ని విశేషాలు ఇప్పుడు చూద్దాం. మ్యాగజైన్ కవర్‌పై మెరుపులు: ఫ్యాషన్ ప్రపంచంలో ఎల్ మ్యాగజైన్ కవర్‌పై కనిపించడం అంటే సామాన్యమైన విషయం కాదు. శోభిత ధూళిపాళ్ల తన అద్భుతమైన పర్సనాలిటీతో ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఈ షూట్‌లో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, ఆమె ఇచ్చిన పోజులు చాలా ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. కేవలం నటనతోనే కాకుండా, ఫ్యాషన్ సెన్స్‌తో కూడా శోభిత తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుందని ఈ కవర్ పేజీ చూస్తే అర్థమవుతోంది. ఆమె కళ్లలో ఉన్న తీక్షణత, ధరించిన హై-స్లిట్ డ్రెస్ ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శోభిత కేవలం గ్లామర్ డాల్‌గా మిగిలిపోవడానికి ఇష్టపడదు. ఆమె ఎంచుకునే పాత్రలు చాలా లోతుగా, ఆలోచింపజేసేలా ఉంటాయి. "మహిళలు విభిన్నమైన మనస్తత్వాలను కలిగి ఉన్నప్పుడే వారు చాలా ఆసక్తికరంగా కనిపిస్తారు" అని ఆమె ఈ ఇంటర్వ్యూలో తెలిపింది. అంటే కేవలం తెరపై కనిపించడం కోసమే కాకుండా, పాత్రలో లీనమై నటించడం తన నైజమని ఆమె చెప్పుకొచ్చింది. 'మేడ్ ఇన్ హెవెన్', 'గూఢచారి', 'మేజర్' వంటి చిత్రాలు ఆమె నటనలోని వైవిధ్యాన్ని ఇప్పటికే చాటిచెప్పాయి. ఈ షూట్ థీమ్ 'ఆర్ట్' కావడంతో, శోభిత తనలోని కళాత్మక కోణాన్ని ఆవిష్కరించింది. తన జీవితంలో క్యూరియాసిటీ అనేది తనను ముందుకు నడిపించే దారి అని ఆమె తెలిపింది. సినిమా అయినా, ఫ్యాషన్ అయినా అందులో కొత్తదనాన్ని వెతకడం ఆమెకు అలవాటు. ఫ్యాషన్ అనేది కేవలం బట్టలు వేసుకోవడం మాత్రమే కాదని, అది ఒక రకమైన భావ వ్యక్తీకరణ అని ఆమె నమ్ముతుంది. అందుకే ఆమె ఫోటోషూట్‌లు ఎప్పుడూ రొటీన్‌కు భిన్నంగా, చాలా స్పెషల్‌గా ఉంటాయి. శోభిత ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే అభిమానుల నుంచి భారీ స్పందనలభించింది. ఇక ముఖ్యంగా అక్కినేని నాగచైతన్యతో పెళ్లి తర్వాత ఆమెకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ కోసం నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇలాంటి పవర్‌ఫుల్ ఫోటోషూట్‌తో రావడం ఆమె ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ అని చెప్పాలి. కేవలం మన దేశంలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో శోభిత క్రేజ్ పెరుగుతోందనడానికి ఈ ఎల్ మ్యాగజైన్ కవర్ ఒక నిదర్శనం.

## మెగాస్టార్ నెక్స్ట్ టార్గెట్ 500 కోట్లే!



సీనియర్ హీరోల్లో మెగాస్టార్ చిరంజీవి సరికొత్త రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి కానుకగా విడుదలైన -మన శంకర వరప్రసాద్ గారు- బాక్సాఫీస్ వద్ద ఏకంగా 400 కోట్ల వసూళ్లను రాబట్టి మెగా స్టామినాను మరోసారి చాటిచెప్పింది. దీంతో చిరంజీవి కెరీర్ లో ఇదే టాప్ గ్రాసర్ గా నిలిచింది. ఈ భారీ విజయం అందించిన ఉత్సాహంతో మెగాస్టార్ తదుపరి చిత్రాల లక్ష్యం 500 కోట్ల మార్కుగా ఫిక్స్ అయింది. వయసుతో సంబంధం లేకుండా యువ హీరోలకు పోటీనిస్తూ చిరంజీవి చేస్తున్న ప్రయోగాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుం టున్నాయి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన -మన శంకర వరప్రసాద్ గారు- చిత్రంలో చిరు కామెడీ టైమింగ్ , మేనరిజమ్స్ ప్రేక్షకులను మెప్పించడంతో వసూళ్ల వర్షం కురిసింది. 400 కోట్ల క్లబ్‌లో చేరడం అనేది ఒక సీనియర్ హీరోకు సామాన్యమైన విషయం కాదు. మెగాస్టార్ మాత్రం ఇక్కడితో ఆగరు. రాబోయే చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలపైనా అన్నయ్య గురి ఉంటుంది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి చిరంజీవి నటిస్తోన్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ -విశ్వంభర- పైనే ఉంది. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోన్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాగా ఇప్పటికే హైలైట్ అవుతోంది. బింబిసార- ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అత్యున్నత స్థాయిలో విఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాకున్న క్రేజ్, మేకింగ్ వాల్యూస్ చూస్తుంటే? ఇది ఈజీగా 500 కోట్ల మార్కును అందు కుంటుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం -విశ్వంభర- గ్రాఫిక్స్ పనుల కారణంగా కొంత ఆలస్యమైనా? జులై 2026లో విడుదలయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా జులై 24వ తేదీకి మెగాస్టార్ కెరీర్‌లో -ఇంద్ర- రిలీజ్ సెంటిమెంట్ ఉండటంతో అదే రోజున ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో పాటు చిరంజీవి - శ్రీకాంత్ ఓదెల , బాబీ కొల్లిల కాంబినేషన్‌లో రాబోయే సినిమాలు కూడా వందల కోట్లవ వసూళ్ల టార్గెట్‌తోనే సెట్స్ పైకి వెళ్తున్నాయి. మొత్తానికి మెగాస్టార్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ బాక్సాఫీస్ చక్రవర్తిగా ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నారు. 400 కోట్ల రికార్డుతో మొదలైన ఈ ప్రస్థానం -విశ్వంభర-తో 500 కోట్ల మైలు రాయిని చేరుకుంటుందా ? లేదా? అన్నది చూడాలి. త్వరలోనే బాబి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. ఈ సినిమా తో పాటు శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్ ను కూడా పట్టాలెక్కించాలని చిరంజీవి ప్లాన్ చేస్తున్నారు.

## జాన్వీ.. టాలీవుడ్ లో ఇలా..




టాలీవుడ్ లో అతిలోక సుందరిగా చిరస్థాయిగా నిలిచిన శ్రీదేవి రేంజ్ కు ఆమె కుమార్తె, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ చేరుకుంటుందా? అనే చర్చ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒకప్పుడు తెలుగు సహా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీని తన అందం, అభినయంతో శాసించిన శ్రీదేవి వారసత్వాన్ని జాన్వీ కపూర్ కొనసాగించగలదా అనే ప్రశ్న అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. శ్రీదేవి 1970లో మా నాన్న నిర్దోషి చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, 1978లో వచ్చిన పదహారేళ్ల వయసుతో స్టార్ డమ్ అందుకున్నారు. అనంతరం ఆమె వెనక్కి తిరిగి చూసుకోకుండా వరుస విజయాలతో టాప్ ప్లేస్ లో నిలిచారు. తెలుగులో దాదాపు 100కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె.. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజాల సరసన సందడి చేశారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ సహా పలువురు సీనియర్ స్టార్ హీరోలతో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె నటించిన జగదేక వీరుడు అతిలోక సుందరి, వేటగాడు, ప్రేమాభిషేకం, కార్తీక దీపం, క్షణం క్షణం వంటి చిత్రాలు ఆమెను టాప్ ప్లేస్ కు చేర్చాయి. ఇక ఇప్పుడు జాన్వీ కపూర్ తన కెరీర్‌ను అదే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ విషయంపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది. బాలీవుడ్ లో ఇప్పటికే తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు టాలీవుడ్ పై పూర్తి దృష్టి సారించినట్లు అర్థమవుతోంది. తెలుగులో ఆమె తొలి చిత్రం దేవర కాగా.. అందులో జూనియర్ ఎన్టీఆర్ సరసన నటించి మంచి గుర్తింపు అందుకుంది. డెబ్యూతో హిట్ కూడా సాధించారు. ఇప్పుడు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది చిత్రంలో కూడా జాన్వీ హీరోయిన్ గా ఎంపిక కావడం విశేషం. దేవర షూటింగ్ లోనే ఆఫర్ రావడం గమనార్హం. పెద్ది మూవీ ఇప్పుడు విడుదలకు సిద్ధమవుతుండగా, టాలీవుడ్ లో ఆమెకు అవకాశాలు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. అయితే జాన్వీ కపూర్ భవిష్యత్తులో మరిన్ని పాన్ ఇండియా స్టార్ హీరోలతో పని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా అల్లు అర్జున్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో నటించాలని ఆమె ఆసక్తి చూపుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే అల్లు అర్జున్ తో ఓ ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయని, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రంలో జాన్వీ కనిపించనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి వరుసగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ టాలీవుడ్ లో తన ప్లేస్ ను స్ట్రాంగ్ గా మార్చుకోవాలని జాన్వీ కపూర్ కృషి చేస్తోంది. అయితే శ్రీదేవి రేంజ్ కు చేరుకోవడం అంత సులభం కాదని చెప్పాలి. అయినప్పటికీ సరైన కథలు, పాత్రలు ఎంచుకుంటూ ముందుకు సాగితే జాన్వీ కూడా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించే అవకాశం ఉందని చెప్పొచ్చు.

## అల్లు శిరీష్ కి అరుదైన గుర్తింపు!




మెగా హీరో అల్లు శిరీష్ ఎట్టకేలకు ఓ ఇంటివాడు అయ్యాడు .తన ప్రేయసి నయనికా రెడ్డితో కలిసి ఆయన వివాహ బంధం లోకి అడుగు పెట్టారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ జంటకు ఒక అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ 'మానిఫెస్ట్' కవర్ పేజీపై ఈ క్రేజీ కపుల్ మెరిశారు. అయితే పెళ్లికి కొన్ని రోజుల ముందు జరిగిన ఈ ప్రత్యేక ఫోటోషూట్.. ఇప్పుడు వివాహం అనంతరం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో ఈ జంట అరుదైన గుర్తింపును సొంతం చేసుకొని అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. అలా మళ్లీ వార్తల్లో నిలిచిన వీరిద్దరికి సంబంధించిన కొన్ని విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ముఖ్యంగా వీరిద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది? జిమ్ పరిచయం కాస్తా పెళ్లి పీటల వరకు ఎలా వెళ్ళింది? అన్న ఆసక్తికర విషయాలు ఈ కవర్ స్టోరీలో ప్రచురించారు. ఆ వివరాలు ఇలా వున్నాయి.. జిమ్ పరిచయం.. మెల్లగా చిగురించిన ప్రేమ: అల్లు శిరీష్, నయనికలది మొదటి చూపులోనే పుట్టిన ప్రేమ కాదు. ఇది చాలా నెమ్మదిగా, ఒక పద్ధతి ప్రకారం మొదలైన 'స్లో బర్న్' రోమాన్స్ అని శిరీష్ స్వయంగా వెల్లడించారు. వాస్తవానికి వీరిద్దరూ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి పెళ్లి కుదిరిన సందర్భంలో నితిన్ , ఆయన భార్య షాలిని ఇచ్చిన పార్టీలో కలిశారు . ఆ తర్వాతే వీరిద్దరూ ఒకే జిమ్‌లో కలిసేవారట. నిజానికి నయనికను కలవాలనే ఉద్దేశంతోనే శిరీష్ తన జిమ్‌ను కూడా మార్చుకున్నారట. అది కేవలం ఒక యాదృచ్ఛికంగా జరిగిన కలయిక కాదు, శిరీష్ ప్లాన్ చేసిన 'జిమ్ రన్-ఇన్' అని ఆయన సరదాగా గుర్తు చేసుకున్నారు. అప్పటి నుండి వీరిద్దరూ వరుసగా డేటింగ్ చేయకపోయినా, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి చాలాసమయం తీసుకున్నారు. నయనిక ఎవరు? ఆ స్నేహం ఎలా మొదలైంది: నయనికా రెడ్డి హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన యువతి. ఆమెకు చిత్ర పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదు. శిరీష్‌తో తన బంధం గురించి ఆమె మాట్లాడుతూ, "ఆయనతో ఉంటే చాలా ప్రశాంతంగా, సహజంగా అనిపిస్తుంది. మా మధ్య మాటలు చాలా నాచురల్‌గా సాగుతాయి" అని చెప్పుకొచ్చారు. ఇక కాలక్రమేణా ఆ స్నేహం బలపడి, ఒకరికొకరు తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఎలాంటి ఆడంబరాలు లేకుండా, చాలా పద్ధతిగా వీరి బంధం పెళ్లి వరకు రావడం విశేషం. ఈ జంట ప్రేమ విషయంలో కుటుంబ సభ్యులు ఒక అడుగు ముందే ఉన్నారట. మార్చి 2026లో వీరి నిశ్చితార్థం మరియు ప్రీ-వెడ్డింగ్ వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో అల్లు అర్జున్ మరియు ఇతర మెగా ఫ్యామిలీ సభ్యులు సందడి చేశారు.

# మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

చేస్తుందో తెలియదన్నారు. నేను మంత్రి పదవి కోసం పాకులాడడం లేదు. ఏ పదవి లేకున్నా రాజగోపాల్ రెడ్డికి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందన్నారు. నాకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమన్నారు. తనకు రేవంత్ రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని.. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ లేదు, ఎదురుపడితే పలకరించుకున్నామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ కేటీఆర్‌తో కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానన్నారు.మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో కూడా హామీ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. హై కమాండ్ ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని చెప్పుకొచ్చారు. తాను మంత్రి పదవి కోసం పాకులాడటం లేదని పేర్కొన్నారు. ఏ పదవి లేకున్నా తనకి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తన లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని తెలిపారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని క్లారిటీ ఇచ్చారు. నిన్న సీఎంతో ప్రత్యేకంగా ఏం భేటీ లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఇవాళ కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని వివరించారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పని కేటీఆర్‌కు చెప్పానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫ్పిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు.

ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

## క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

మొదటిపేజీ తరువాయి

చైతన్య కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలా చైతన్యం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడా నికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. అంకిత్ కోట్ల, డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి.అనిరుధ్, డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా.కె.ప్రశాంత్, డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ మంగళవారం కెబిఆర్ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని, డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా.దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలని వీరంతా సూచించారు.

## అసెంబ్లీ ముట్టడికి బిఆర్ఎస్ విద్యార్థుల యత్నం

మొదటిపేజీ తరువాయి

రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఇవాళ బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీని ముట్టడించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ.. ఉద్యమాలను అణిచివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. ఇది రాజ్యాంగ హక్కులను హరించడమే అని స్పష్టం చేశారు. ఇవాళ రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. గురుకులాలను పట్టించుకోవడం లేదని.. ప్రభుత్వ బడులను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని వారు విమర్శించారు. నిరుద్యోగుల, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యారంగంపై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పుచ్చుకుంటుందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు.

## జిహెచ్ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

మొదటిపేజీ తరువాయి

దించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్ బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు. జిహెచ్ఎంసి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు. 2016 లో ఎస్ఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా మీకు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి' అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివృద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తుచేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు

మొదటిపేజీ తరువాయి

లను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. తదుపరి అక్రిడిటేషన్ కమిటీ సమావే శాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. ఈ సమావేశంలో సమాచార-పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

మొదటిపేజీ తరువాయి



చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లేక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.' అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. దేశంలోని ప్రముఖు లను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందు కున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగి స్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విష యంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భం గా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకు నేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి




మొదటిపేజీ తరువాయి

వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంబోతుల కొట్లాటలో లేగలు బలైనట్లుగా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

మొదటిపేజీ తరువాయి

ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు, హైర్ లేదా డిపార్ట్‌మెంట్‌లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి... క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్, ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం... వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

మొదటిపేజీ తరువాయి

ప్రసంగించారు. ఇరాన్ సంక్షో భం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడుపరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.





# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కలవాలి

## - జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## - జిల్లాలో 100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్ మార్చి 24 : టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కలవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన "టీబీ ముక్త్ భారత్ అభియాన్" 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని, స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా పలువురు టిబి వ్యాధిగ్రస్తులు వారి అనుభవాలను, అభిప్రాయాలను కార్యక్రమంలో వెల్లడించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 24 గ్రామాలను ఇప్పటికే టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించామని, ఇందులో రెండు ఏళ్లుగా టీబీ కేసులు లేని టక్కుగూడ గ్రామానికి 'సిల్వర్ మెడల్' లభించిందని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి మరిన్ని గ్రామాలు గోల్డ్ మెడల్ సాధించే దిశగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం కీలకమని, దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ నుండి పూర్తిగా కోలుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అధునాతన 'హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే' యంత్రాలను అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా సామాజిక అంశాలపై సైతం దృష్టి సారించాలని, జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టి 'బాల్య వివాహ రహిత పంచాయతీలు'గా తీర్చిదిద్దాలని సర్పంచులకు సూచించారు. అలాగే, మహిళలందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షల కోసం త్వరలోనే ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. మూఢనమ్మకాలను నమ్మకుండా, వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని ప్రజలను కోరారు. అనంతరం పలువురు టిబి వ్యాధిగ్రస్థులకు కళావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిక్షయ్ మిత్ర కిట్ లను, టిబి నియంత్రణకు కృషి చేసిన సర్పంచ్ లకు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రశంస పత్రాలను అందజేశారు. తదుపరి టిబి నియంత్రణ అవగాహన ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించి వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకోవాలని, రెఫరల్ కేసులను నిరంతరం పర్యవేక్షించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో గోపాల కృష్ణ రెడ్డి, కళావతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అశోక్, వైద్యులు, రోగులు, ఆయా సర్పంచ్లు రంజన, లక్ష్మీ, కోమల్, లత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# సాగునీటి విషయంలో రైతులు ఆందోళన చెందొద్దు

## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మార్చి 24 : చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని, చివరి మడి వరకు నీటిని అందించి పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం హైదరాబాద్లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఈఎన్సీ రమేష్ బాబును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మర్యాదపూర్వకంగా కలిసి చొప్పదండి నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి సమస్యలపై చర్చించారు..ముఖ్యంగా గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు తక్షణం నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వరద కాలువకు నీటిని విడుదల చేయాలని ఈఎన్సీ రమేష్ బాబుకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఎల్లుండి గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికార యంత్రాంగం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది ఎంతో ఉపశమనాన్ని కలిగించే నిర్ణయమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు తీసుకున్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.







# విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా విద్యా బోధన సాగాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్ మార్చి 24 : ప్రభుత్వ బడుల్లో, విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలనే లక్ష్యంగా విద్యాబోధన సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలం చించోలి బి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా బడికి రావాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అన్ని శ్రద్ధగా వినాలని పేర్కొన్నారు. వేసవికాలం వల్ల మధ్యాహ్నం నుంచి పాఠశాలకు సెలవు ఉంటుందని, మధ్యాహ్నం వేళల్లో ఎండ అధికంగా ఉన్నందున విద్యార్థులు బయట తిరగకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. భోజనశాల లేదన్న విషయం విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ భోజనశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ప్రతిరోజు విద్యార్థులందరికీ ప్రతిరోజు శుచి శుభ్రతలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. పిల్లలకు ఎటువంటి సమస్యలు కలగకుండా చూసుకోవాలని వివరించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తయిన పరీక్షలు, ఇంకా మిగిలి ఉన్న పరీక్షల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పరీక్షలన్నీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పరీక్షలపై ఎటువంటి భయం అవసరం లేదని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులతో బోర్డుపై గణితం లెక్కలను చేయించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం నాణ్యవంతంగా ఉందని ప్రశంసించారు. మిగతా పనినంతటిని త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశం చేసుకోవాలన్నారు. ఈ తనిఖీలలో డీఈవో భోజన్న, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత రావు, సర్పంచ్ సాయన్న, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నీటి సంరక్షణలో మహిళల పాత్ర కీలకం

## - భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ బాబు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్ మార్చి 24 : మామడ మండలంలోని బండల్ ఖానాపూర్ గ్రామంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో 'అవల్ రూరల్ లైవిలిహుడ్ ఎంపవర్ మెంట్ సొసైటీ' (స్వచ్ఛంద సంస్థ) సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. 'నీరు, లింగ సమానత్వం' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు పి. శ్రీనివాస్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలని, భావి తరాల కోసం నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా నీటి నిర్వహణలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, వృధాగా పోయే ప్రతి నీటి బొట్టును భూమిలోకి మళ్లించాలని కోరారు. గ్రామస్థులంతా నీటి పొదుపును ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో నీటిని పొదుపుగా వాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురిని ఈ సందర్భంగా శాఖా పరంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధు, రైతులు పాల్గొన్నారు.

# నేటి జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్"కు సంపూర్ణ మద్దతు



## - ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి - పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
## - జర్నలిస్టుల పోరాటాలకు మా సంపూర్ణ మద్దతు
## - జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, మార్చి 24 : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకుని రెండున్నరేళ్లయినా జర్నలిస్టుల సమస్యలు ఒక్కటీ తీర్చలేదని విమర్శించారు. జర్నలిస్టులు చేస్తున్న పోరాటాలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. రేపు బుధవారం జర్నలిస్టులు తలపెట్టిన"ఛలో హైదరాబాద్" కార్యక్రమానికి తమ పార్టీ సంఘీభావం తెలుపుతుందని మంగళ వారం కేఎస్ఆర్ గౌడ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదకొండేళ్ళు గడిచిపోయిందని, జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు జర్నలిస్టులు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన పాత్ర చాలా కీలకం అని, జర్నలిస్టుల గురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి మంత్రిగా ఉండటం తమ దౌర్భాగ్యమని జర్నలిస్టులు భావిస్తున్నారని కేఎస్ఆర్ గౌడ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 50 వేల మంది జర్నలిస్టులున్నారని, వీరిలో అత్యధిక శాతం కడు పేదరికంలో మగ్గుతున్నారని, వేతనాలు లేక అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులతో కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని, చాలా మంది అనారోగ్యంతో వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు ఇవ్వాలని, అలాగే అర్హులైన ప్రతి సీనియర్ జర్నలిస్టుకు నెలకు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, చిన్న మధ్య తరహా పత్రికల బకాయిలు చెల్లించాలని కేఎస్ఆర్ గౌడ డిమాండ్ చేశారు.

# వేసవికాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

## - జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్ మార్చి 24 : వేసవికాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. వేసవికాల ప్రణాళికపై సంబంధిత అధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో అధిక ఉష్ణో గ్రతలు నమోదవుతున్నాయని, తీవ్రమైన ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. వడదెబ్బన బారినపడిన ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలలోనే మెరుగైన చికిత్స అందించాలని అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేలా, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బస్టాండ్లు, ప్రధాన కూడళ్ళు, జన సంచారం అధికంగా ఉన్న ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజలకు విరివిగా ఓఆర్ఎస్ పొట్లాలు పంపిణీ చేస్తూ ఉండాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ కూలీలు అధిక ఉష్ణోగ్రత సమయంలో జాగ్రత్తవగా ఉండాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, వడదెబ్బ సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే జనాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడా కూడా ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైనచోట బోరు బావులకు మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీటి ఇబ్బందులు ఏర్పడితే, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, సమస్యలు తీర్చాలన్నారు.వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువ సంభవించేందుకు ఆస్కారం ఉన్నందున అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సమస్యల పరిష్కారానికే బస్సు జాత

## - నేటి సింగరేణి పరిరక్షణ పోరు యాత్రకు భూపాలపల్లి సిద్ధం - ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ - సేవ్ సింగరేణి బస్సు జాత గోడపత్రికల ఆవిష్కరణ-కార్మికులకు ఏకతా పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మార్చి 24 : సింగరేణి సమస్యల పరిష్కారానికే బస్సు జాత కార్యక్రమమని, నేటి సింగరేణి పరిరక్షణ పోరు యాత్రకు భూపాలపల్లి ఏరియా కార్మిక వర్గం సిద్ధంగా ఉందని మోటపలుకుల రమేష్ అన్నారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసి-2 గనిలో మంగళవారం ఆయన 'సేవ్ సింగరేణి' బస్సు జాత గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ మనుగడను కాపాడేందుకు 'సింగరేణి పరిరక్షణ పోరు యాత్ర'ను ప్రారంభించినట్లు తెలిపారు. సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ విధానాల ప్రభావం నేపథ్యంలో కార్మికులను చైతన్యపరచడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ యాత్ర భాగంగా మార్చి 25 సాయంత్రం 5 గంటల తర్వాత భూపాలపల్లికి చేరుకోనుండగా, అంబేడ్కర్ చౌరస్తాలో 'కార్నర్' సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే మార్చి 30న కొత్తగూడెంలో 'చలో కొత్తగూడెం' పేరుతో సింగరేణి ప్రధాన కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థకు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.30,000 కోట్లు బకాయిలు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రూ.50,000 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు. రాజకీయాన్ని జొప్పించి ఇంకా సంస్థను దివాలా తీసేలా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా నాయకత్వం పలు కీలక డిమాండ్లను ముందుకు తీసుకువచ్చింది. సింగరేణికి రావాల్సిన సుమారు ?52,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త గనులను వేలం వేయకుండా నేరుగా సంస్థకే కేటాయించాలని, కారుణ్య నియామకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

# రాజీ మార్గమే - రాజా మార్గం...

## - ప్రజలు లోక్ అదాలత్ ను సద్వినియోగించుకోవాలి
## - టేక్మాల్ ఎస్సై అరవింద్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ 24 : ఈ నెల 24నుండి నిర్వహించే జాతీయ మేఘ లోక్ అధాలత్ అందరు సద్వినియోగం చేసుకొని టేక్మాల్ ఎస్సై అరవింద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ భావితరం భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పెట్టీ (డ్రైవింగ్ లైసెన్స్ లేని, మైనర్ డ్రైవింగ్ నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలు జప్తు చేసిన కేసులు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులు మొదలైనవి) ఎక్కువ చాలాన్లు పెండింగ్ ఉన్న కేసులను రాజి చేసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు సంబంధిత కేసులతో పాటు ఈ లోక్ అదాలత్ లో పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్య భర్తల పంచాయితీలు, బ్యాంక్ రికవరీలు, చెక్ బౌన్స్ కేసులు, కొట్లాటలు, రోడ్ ఆక్సిడెంట్స్ కేసులు, పేకాట, ఎక్సైజ్ కేసులు దొంగతనం కేసులు, కూడా ఈనెల 24 నుండి 28 వరకు అల్లా దుర్గం కోర్టులో నిర్వహించడం జరుగుతుందని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.పంతాలకు పోకుండా మానసిక ప్రశాంతత కొరకై రాజి మార్గం ఉత్తమైనది. సమస్యలను సమస్యలుగా కాకుండా, పరిష్కారాల దిశగా ఆలోచన చేయాలని ఇట్టి లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం కోసం ఏవైనా సందేహాలు ఉన్న స్థానిక టేక్మాల్ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించవచ్చని అన్నారు.

# రాజీమార్గమే రాజ మార్గం



## - రాజీతో సమస్యలను పరిష్కరించుకోండి - జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మార్చి 24 : రాజీమార్గమే రాజమార్గమని, రాజీతో సమస్యలను పరిష్కరించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఈ నెల 28న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ శనివారం నిర్వహించబడే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరస్పర సమ్మతితో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ వైవాహిక సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు.ఈ కేసుల్లో కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పరిష్కారం పొందవచ్చని అన్నారు. చిన్న చిన్న వివాదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కన్నా రాజీ ద్వారా పరిష్కారం ఉత్తమమని సూచించారు. జ్యుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com